నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 11-11-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:87 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం-నేటికి అందం

కూబర కృత్రిమ మేధను
రాబడులను జూచుకొనక రాష్ట్ర యువతలో
నేబది లక్షల మందికి
బాబు మహోన్నతముగ నిడ పథము సృజించెన్ !! ?

(రాష్ట్రంలోని యాభై లక్షల మందికి కృత్రిమ మేధ ను అందించేందుకు చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు. ఇది యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.)

-రాధశ్రీ
సెల్:9494481210



చురక

మనిషిలోని మేధస్సును
మట్టుబెట్ట ఎవరితరం
చెలిమెలోని ఊటలాంటి
చైతన్యం భావ స్వరం.
అదే మేధో నక్సలిజం
అంటూ ఏల కలవరింత
దాన్ని హతం చేస్తమంటే
దునియాలో పెద్ద వింత

-వేల్పుల నారాయణ
9440433475



కరవుతో ఇబ్బందుల్లో రైతులు.. పంట రుణాల రీషెడ్యూల్‌కు భట్టి ఆదేశాలు



హైదరాబాద్, నవంబర్ 10: రైతులకు బ్యాంకులు అండగా నిలవాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈరోజు(మంగళవారం) ప్రజాభవన్‌లో జరిగిన ప్రత్యేక రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశానికి డిప్యూటీ సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొన్నాయని.. రైతులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు బ్యాంకులు ప్రత్యేక చొరవ చూపాలని... అర్హులైన రైతుల పంట రుణాలను రీషెడ్యూల్ చేయాలని ఆదేశించారు.రబీ సీజన్‌కు కొత్త పంట రుణాలను సకాలంలో అందించాలని భట్టి సూచించారు. బ్యాంకుల చుట్టూ రైతులు తిరిగే పరిస్థితి ఉండకూడదని తెలిపారు. విద్య, గృహ రుణాల మంజూరులో బ్యాంకులు సానుకూలంగా ఉండాలని నిర్దేశించారు. ఎంఎస్ఎంఈ, మౌలిక సదుపాయాల రంగాలకు రుణాలు పెంచాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 365 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించామని.. 111 మండలాల్లో తీవ్ర కరవు పరిస్థితులు ఉన్నట్లు తెలిపారు. తక్కువ నీటితో సాగయ్యే పంటలకు రుణాలు అందించాలని.. పంటల మార్పిడి, నూక్ష్మ సేద్యానికి ఆర్థిక సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు.

రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు కల్పించాలని ఉపముఖ్యమంత్రి సూచించారు. 10 నుంచి 15 శాతం రైతు కుటుంబాలకు అదనపు ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు అదనంగా రూ.2 లక్షల వరకు రుణాలపై పరిశీలన చేయాలని అన్నారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రుణాలు ఇవ్వాలని నిర్దేశించారు. ఈ నెల 19 నాటికి రాజీవ్ యువ వికాసం అమలుకు బ్యాంకర్లు సహకరించాలన్నారు. రైతులు తదుపరి వ్యవసాయ సీజన్‌ను ఆత్మవిశ్వాసంతో ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

19న మరో పథకం ప్రారంభం..

మంత్రి వివేక్ కీలక ప్రకటన



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 10:(నేటినిజం ప్రతినిధి): సీఎం రేవంత్‌రెడ్డి రూ.5 లక్షల ఇందిరమ్మ బీమా పథకాన్ని సిద్దిపేట వేదికగా 19వ తేదీన ప్రారంభిస్తారని తెలంగాణ మంత్రి వివేక్ వెంకట్ స్వామి పేర్కొన్నారు. ఈ పథకాన్ని అర్హులకు ఇస్తామని స్పష్టం చేశారు. రూ.20 లక్షల విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌నూ అమలు చేస్తామని తెలిపారు. ఈ నెల 19న సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభ నేపథ్యంలో పట్టణంలో సభ స్థలి కోసం పలు ప్రాంతాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ హైమవతి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడారు.

మా ప్రభుత్వ పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారు..

తమ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని మంత్రి వివేక్ వెంకట్ స్వామి వ్యాఖ్యానించారు. ఈ నెల 19వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి సభను పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సభ కోసం మూడు, నాలుగు స్థలాలు చూశామని.. ఒకటి ఫైనల్ చేశామని వెల్లడించారు. తెలంగాణలో మాదిరిగా పెద్దఎత్తున ఇందిరమ్మ ఇళ్లను ఎక్కడా కట్టలేదని మంత్రి వివేక్ వెంకట్ స్వామి పేర్కొన్నారు.

అన్ని పథకాలను అమలు చేస్తున్నాం: మంత్రి పొన్నం ప్రభాకర్

చిలక పచ్చరంగు ఇందిరమ్మ చీరలను సీఎం రేవంత్‌రెడ్డి 19వ తేదీన ఆవిష్కరిస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. మూడేళ్లలో ఎన్నికల ముందు చెప్పిన అన్ని పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పుకొచ్చారు. సిద్దిపేట సభ ద్వారా తాము చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతో పాటు భవిష్యత్తులో అమలు చేసే మరిన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలను ముఖ్యమంత్రి ప్రకటిస్తారని అన్నారు. సీఎం సభకు సిద్దిపేట చుట్టూ పక్కల ఉన్న నియోజకవర్గాల ప్రజలు పెద్దసంఖ్యలో హాజరవుతారని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

ప్రముఖ కవి డాII అందెశ్రీకి ఘన నివాళి

రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సంస్మరణ సభ



అందెశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాII ఏనుగు నరసింహారెడ్డి, సాంస్కృతిక శాఖల మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు, డా. జి.వి. వెన్నెల, ముచ్చర్ల దినకర్ తదితరులు

హైదరాబాద్, నవంబర్ 10(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ప్రజల హృదయాల్లో తనదైన కవిత్వంతో, పాటలతో చిరస్థాయిగా నిలిచిపోయిన ప్రముఖ కవి, గేయ రచయిత డా. అందెశ్రీ గారి స్మృతికి నివాళులర్పిస్తూ తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, మొదటి అంతస్తులో ఘనంగా సంస్మరణ సభ నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ సాంస్కృతిక సారథి అధ్యక్షురాలు డా. జి.వి. వెన్నెల గారు సభకు అధ్యక్షత వహించారు.

సభ ప్రారంభానికి ముందు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు అందెశ్రీ గారు రచించిన పలు గేయాలను ఆలపించి ఆయనకు సంగీత నివాళులర్పించారు. ఆయన కలం నుంచి జాలువారిన ప్రజా చైతన్య గీతాలు, సామాజిక స్పృహను ప్రతిబింబించే పాటలు సభికులను భావోద్వేగానికి గురిచేశాయి. వేదికమీద అందెశ్రీగారిపై రూపొందించిన ప్రత్యేక డాక్యుమెంటరీని ప్రదర్శించారు.

కార్యక్రమానికి డా. ఏనుగు నరసింహారెడ్డి, ఐ.ఏ.ఎస్. గారు స్వాగత వచనాలు పలికారు. అనంతరం అతిథులు అందెశ్రీ గారి సాహిత్య ప్రస్థానం, కవిత్వంలోని సామాజిక చైతన్యం, తెలంగాణ ఉద్యమంలో ఆయన పాటలు పోషించిన పాత్ర, ప్రజల జీవితాలతో ఆయన రచనలకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

ఈ సంస్మరణ సభలో అరుణోదయ సాంస్కృతిక మండలి అధ్యక్షురాలు శ్రీమతి విమలక్క గారు, సీనియర్ పాత్రికేయులు శ్రీ పాశం యాదగిరి గారు, సీనియర్ పాత్రికేయులు, ప్రకృతి వ్యవసాయ రైతు శ్రీ పిట్టల శ్రీశైలం గారు, అందెశ్రీ గారి జీవిత ప్రస్థానంపై డాక్యుమెంటరీ రూపొందించిన శ్రీ రాజు గారు, సమాచార పౌర సంబంధాల శాఖ క్రియేటివ్ డైరెక్టర్ డా. సింగం చరణ్ కౌశిక్ గారు సలహా మండలి సభ్యులు ముచ్చర్ల దినకర్, పల్లెనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వక్తలు అందెశ్రీ గారితో తమకున్న అనుబంధాన్ని, ఆయనతో కలిసి పనిచేసిన సందర్భాలను, ఆయన వ్యక్తిత్వంలోని నిరాడంబరతను, సాహిత్యంలోని మానవీయ విలువలను స్మరించుకున్నారు. ఆయన రచనలు కేవలం పాటలకే పరిమితం కాకుండా ప్రజల ఆలోచనల్లో, సామాజిక చైతన్యంలో భాగమయ్యాయని పేర్కొన్నారు...

తెలంగాణ అస్తిత్వాన్ని, ప్రజల ఆకాంక్షలను, పల్లె జీవన సౌందర్యాన్ని తన అక్షరాల్లో ఆవిష్కరించిన అందెశ్రీ గారి సాహిత్యం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని వక్తలు అభిప్రాయపడ్డారు.

మనిషి మరణించినా అతని ఆలోచనలు, ఆశయాలు, అక్షరాలు సజీవంగా ఉంటాయి. అందెశ్రీ గారి విషయంలోనూ అదే నిజమని, ఆయన కలం నుంచి పుట్టిన పాటలు తెలంగాణ గుండెల్లో ఎప్పటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంటాయని ఈ సంస్మరణ సభ చాటిచెప్పింది.

బాయిలర్ల నిర్వహణపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్, నవంబర్10: రాష్ట్రంలో బాయిలర్ల నిర్వహణపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బాయిలర్ల సర్టిఫికెట్ల గడువు మరో మూడు నెలలు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం తెలంగాణ ప్రభుత్వం జీవో నంబర్ 465 జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం చూపిందని వివరించింది. దీంతో ఇంధన వినియోగాన్ని సమర్థంగా నిర్వహించేందుకు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపింది.

100 టన్నులు, అంతకంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న బాయిలర్లకు ఈ వెసులుబాటు వర్తిస్తుందని పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో విద్యుత్ కేంద్రాలు, చమురు, గ్యాస్ పరిశ్రమలకు ఊరట కలిగిస్తుంది. అలాగే పెట్రోలియం రిఫైనరీలు, పెట్రోకెమికల్‌తోపాటు ఎరువుల పరిశ్రమలకు వెసులుబాటు కల్పిస్తుంది. 2026, నవంబర్ 30వ తేదీ వరకు మాత్రమే గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్ అమలు కానుంది.

ఓబీసీలకు రాజకీయ ప్రాతినిధ్యంపై రాహుల్‌తో చర్చించా: మహేశ్ గౌడ్

ఢిల్లీ, నవంబర్ 10: దేశవ్యాప్తంగా, తెలంగాణలో ఓబీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతో చర్చించినట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈరో జు రాహుల్‌తో సమావేశమైన పీసీసీ చీఫ్.. భారత్ సమ్మిట్‌కు రావాల్సిందిగా ఆ హ్వానించారు. అనంతరం ఆయన మీడియా తో మాట్లాడుతూ... వెనుకబడిన తరగతులకు రాజకీయాల్లో మరింత ప్రాధాన్యం కల్పిం చాల్సిన అవసరాన్ని రాహుల్‌కు వివరించి నట్లు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంస్థాగత కార్యక్రమాలను వివరించానన్నారు.

బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై చర్చ జరిగిందని టీపీసీసీ చీఫ్ వెల్లడించారు. నవంబర్ 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే భారత్ సమ్మిట్‌కు రాహుల్ వస్తున్నట్లు మహేశ్ కుమార్ తెలిపారు. భారత్ సమ్మి ట్‌తో పాటు గిగ్ వర్కర్ల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని రాహుల్ గాంధీ సూచించారన్నారు. తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేక చట్టం తీసుకొచ్చిన నేపథ్యంలో వారితో సమా వేశం నిర్వహించాలని రాహుల్ గాంధీ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. గిగ్ వర్కర్లను ఉద్దేశించి ఏఐసీసీ అగ్రనేత ప్రసంగించే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌లో ఎన్ఐఆర్‌కు వ్యతిరే కంగా నిర్వహించనున్న సభపై రాహుల్ గాంధీతో చర్చించినట్లు పీసీసీ చీఫ్ చెప్పా రు. తెలంగాణలో మెగా బీసీ ర్యాలీ నిర్వ హణకు ఆహ్వానించానని తెలిపారు. మం త్రులు, ఎంపీల మధ్య విభేదాలు, ఢిల్లీలో జరిగిన పరిణామాలపై ఏఐసీసీ అగ్రనేతతో సమావేశంలో చర్చ జరగలేద న్నారు. ఈ అంశాలను పార్టీ ఇన్‌ఛార్జ్, ప్రధాన కార్య దర్శి కేసీ వేణుగోపాల్ చూసుకుం టారని వెల్లడించారు. నవంబర్ చివరినాటి కి తెల ంగాణలో నామినేటెడ్ పోస్టుల భర్తీ పూర్త వుతుందని స్పష్టం చేశారు.సోనియా గాంధీ జీవిత విశేషాలతో వెలువడిన పుస్త కాన్ని మహేశ్ కుమార్ గౌడ్ స్వాగతించారు. సోనియా గాంధీ, రాజీవ్ గాంధీ అనుబంధం, భారతీయ సంప్రదాయాలను స్వీకరించిన అంశాలను పుస్తకంలో ప్రస్తావించారన్నారు.

దేశం గర్వించేలా ఖేలో ఇండియా.. అధికారులకు మంత్రి శ్రీహరి కీలక ఆదేశాలు



హైదరాబాద్, నవంబర్ 10: ఖేలో ఇండియా నిర్వహణపై మంత్రి వాకిటి శ్రీహరి ఈరోజు (మంగళవారం) సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. దేశం గర్వించేలా ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలతోనే తెలంగాణలో ఖేలో ఇండియా నిర్వహించేందుకు అవకాశం వచ్చిందన్నారు. మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి భవిష్యత్ తరాలకు అందించాలని తెలిపారు. ఈ విషయంలో డిప్యూటీ కలెక్టర్లకు పూర్తి అధికారాలు ఇస్తున్నట్లు వెల్లడించారు.

అనవసర ఖర్చులు వద్దని.. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు సాధించాలని మంత్రి చెప్పుకొచ్చారు. యువతను రీల్స్, బెట్టింగ్ మహమ్మారి నుంచి బయటకు తీసుకురావాలని డిప్యూటీ కలెక్టర్లకు మంత్రి వాకిటి శ్రీహరి సూచనలు చేశారు. ఈ సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ స్పెషల్ సీఎస్ వాణీ ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ విసి &ఎండీ సోనిబాలాదేవి, వివిధ జిల్లాల డిప్యూటీ కలెక్టర్లు, స్పోర్ట్స్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో ఘనంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ స్వర్ణలత దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు

లయన్స్ క్లబ్, గౌరిశెట్టి చారిటబుల్ ఆధ్వర్యంలో అన్నదాన వితరణ చేసిన మేయర్ దంపతులు.



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 10:(నేటినిజం ప్రతినిధి): ,నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ - స్వర్ణలత దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు కరీంనగర్ లో ఘనంగా జరిగాయి. మంగళవారం నగరంలోని వెంకటేశ్వర టెంపుల్ చౌరస్తా లో లయన్స్ క్లబ్ కరీంనగర్ పౌండేషన్ ఆధ్వర్యంలో వివాహ వార్షికోత్సవం సంధర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ దంపతులు తన చేతుల మీదుగా అన్నదాన వితరణ చేశారు. అనంతరం నగరంలోని ప్రభుత్వ హాస్పిటల్ లో గౌరిశెట్టి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో హాస్పిటల్ లో ఉండే రోగులు వారి బంధువులకు మేయర్ కొలగాని శ్రీనివాస్ స్వర్ణలత దంపతుల తమ చేతుల మీదుగా అన్నదానం చేశారు. అనంతరం లయన్స్ క్లబ్, గౌరిశెట్టి మెమోరియల్ ట్రస్ట్ సంస్థల నిర్వహాకులు మేయర్ దంపతులను గౌరవంగా సత్కరించి... వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మరో వైపు నగరంలోని తీగలగుట్ట పల్లి క్యాంపు కార్యాలయంలో మేయర్ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. పలువురు పాలకవర్గ సభ్యులు మేయర్ దంపతులను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి... శాలువాలతో సత్కరించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఆద్యకళ అమ్మ ఇకలేరు


జయధీర్ తిరుమలరావు సతీమణి నీల కన్నుమూత

హైదరాబాద్, నవంబర్ 10(నేటినిజం ప్రతినిధి): ప్రముఖ పరిశోధకుడు ఆచార్య జయధీర్ తిరుమలరావు సతీమణి నీల (70) ఇక లేరు. గుండె, శ్వాస కోశ సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఆమె నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి 10.30 గంటలకు తుదిశ్వాస విడిచారు.



జయధీర్ తిరుమల రావు సేకరించిన ఆద్యకళ లోని చారిత్రక వస్తువులను భద్రపరచడం, వాటి సంరక్షణ బాధ్యతలను నిర్వర్తించడంలో నీల ప్రముఖ పాత్ర పోషించారు. తిరుమల రావు కృషిని గుర్తించిన వారంతా నీలను ఆద్యకళకు అమ్మగా అభివర్ణిస్తూంటారు. తాళపత్ర గ్రంథాలు, కాగితపు చుట్టలు, ఆదివాసీ, గిరిజన సంస్కృతికి, అద్దంపట్టే సంగీత వాద్యాలు, మట్టి పాత్రలు, లోహపు వస్తువులు కుల పురాణాలు కళ్లకు కట్టే పటాలు వంటి అరుదైన అపూర్వమైన వస్తు సంచయాన్ని సంరక్షిస్తూ తద్వారా ప్రజా సాంస్కృతిక రంగానికి నీల అవిరళ కృషి చేశారంటూ పలువురు కవులు, రచయితలు, పరిశోధకులు ఆమె సేవలను గుర్తు చేసుకున్నారు.

వేదకుమార్, జూలూరు గౌరీశంకర్, విమలక్క ప్రొఫెసర్ విమల, కాలువ మలయ్య, నర్సన్, జర్నలిస్టు మల్లయ్యగౌడ్, బి.వి.యన్.స్వామి, బైస దేవదాను, ప్రొ. భగవత్‌రెడ్డి, ప్రొ. వినయ్‌బాబు, జి. అనసూయ, ఉడయవర్లు, యం.వి.ఆర్. శాస్త్రి, వీక్షణం వేణుగోపాల్, పిట్టల శ్రీశైలం, భూవతి వెంకటేశ్వర్లు, తదితరులు జయధీర్ తిరుమలరావుకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.



పార్థివదేహంకు నివాళులర్పిస్తున్న ప్రముఖులు

మాసాల్లోకెల్లా పరమ పవిత్రం కార్తీక మాసం

(10 నవంబర్ – 08 డిసెంబర్ 2026 “కార్తీక మాసం” శుభ సందర్భంగా)

బతుకమ్మ పండుగ తర్వాత దసరా సరదాలు కూడా అనుభవించాం. దీపావళి వెలుగుల్లో మన ఇంటికి సంతోష తోరణాలు కట్టాం. నవంబర్ 09, 2026న ఆశ్వయుజ మాసం ముగుస్తూ 10 నవంబర్ 2026 రోజున పరమ పవిత్ర కార్తీక మాసం మొదలు అవుతున్నది. పురాణాల ప్రకారం, 12 మాసాల్లో కార్తీక మాసం అత్యంత పవిత్రమైనది. శివకేశవులకు ఇష్టమైన కార్తీక మాసంలో పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తే మోక్షం కలుగుతుందని విశ్వాసం. “కార్తీక మాసం కన్న పరమ పవిత్ర మాసం లేదని, మహావిష్ణువుకు సమానమైన దేవుడు లేడని, వేదానికి సమానమైన శాస్త్రం ఏదీ లేదని, గంగతో సమానమైన తీర్థం లేదని” స్కంద పురాణం పేర్కొంటున్నది. శివారాధన విశిష్టమైన కార్తీక మాసం 10 నవంబర్ నుంచి 08 డిసెంబర్ 2026 వరకు కొనసాగుతుంది. మహిమాన్వి తమైన కార్తీక మాసంలో పరమేశ్వరుడిని విశేష భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తాం. దామోదర మాసంగా పిలుచుకునే పండుగగా అశేష భక్తకోటి పారవశ్యంలో మునిగి పూజలు, వ్రతాలు, ఉపవాసాలు, వన భోజనాలతో భక్తి వరదలతో గుడుస్తుంది. కార్తీక మాసంలో సత్యనారాయణ వ్రతాలు, విష్ణుసహస్రనామ పారా యణాలు, లలిత సహస్రనామ పారాయణాలు ఆచరిస్తారు.

శివారాధనల శుభ గడియలు:

ఏడాదిలో తొమ్మిదవ నెలలో వచ్చే కార్తీక మాసంలో శివాలయాల్లో రుద్రాభిషేకాలు, రుద్రపూజలు, లక్ష బిల్వదళ పూజలు, అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు లాంటివని విశేషంగా జరుపుకోవడం అనాదిగా వస్తున్నది. శివున్ని పూజించడంతో మరుజన్మ ఉండదని భక్తులు విశ్వసిస్చారు. అశుతోషుడైన పరమ సదాశివుడు కోరిన కోర్కెలను తీర్చి సకల సౌఖ్యాలను కలిగిస్తున్నాడు. కార్తీక మాసంలో పవిత్ర నదిలో స్నానాలు చేయడంతో పాటు 365 ఒత్తులతో దీపారాధనలు చేస్తారు. పరమ పవిత్రంగా భావించే ఉసిరి చెట్టు కింద ఆవు నెయ్యితో దీపం పడతారు. ఈ మాసం దీప దానం చేస్తే చీకట్లు తొలగుతాయని, లక్ష్మీదేవి అనుగ్రహం కలిగి ఆ ఇల్లు సిరి సంపదలతో నిండిపోతుందని ప్రగాఢ విశ్వాసం. తులసి కోటకు పూజలు నిర్వహిస్తారు. పున్నమి వెలుగుల్లో కార్తీక దీపాలను వెలిగించి నదుల్లో, పారే నీటిలో వదులుతారు. సోమవారం కఠిన ఉపవాస దీక్షలు ఆచరిస్తారు. కార్తీక పూజలతో ఈతని బాధలు తొలిగి జన్మజన్మ పాపాలు తొలగి పోతాయని నమ్మకం. దాన ధర్మాలు చేస్తే ఎంతో పుణ్యం వస్తుందని నమ్ముతారు.

కార్తీక మాస విశిష్ట రోజులు:

10 నవంబర్ 2026 రోజున అన్న కూట్, గోవర్ధన పూజ, బలి ప్రతిపద పండుగ జరుపుకుంటాం. నవంబర్ 11న భాయ్ దూజ్, తమ ద్వితీయ, చిత్రగుప్త పూజ, నవంబర్ 13న నాగుల చవితి, మానసిక వినాయక చతుర్థి వ్రతం, 15న స్కంద పుష్టి, 16న తొలి కార్తీక సోమవారం, 17న గోపాష్టమి, 20న ఉత్థాన ఏకాదశి, 21న క్షీరాబ్ధి ద్వాదశి, 23న రెండవ కార్తీక సోమవారం, వైకుంఠ చతుర్దశి, 24న కార్తీక పౌర్ణమి, 30న కార్తీక మూడవ సోమవారం, 04 డిసెంబర్‌న ఉత్పన్న ఏకాదశి, 07 డిసెంబర్‌న కార్తీక నాలుగవ సోమవారం మాస శివరాత్రి, 08న అమావాస్యతో కార్తీక మాసం ముగుస్తుంది. 09 డిసెంబర్‌న పోలి స్వర్గం పూజలు చేస్తారు. ఈ పవిత్ర మాసంలో నాగ పంచమి, చత్ పూజ, అష్టమి వ్రతం, కార్తీక వీర్య జయంతి, గోపాష్టమి, మాసిక్ దుర్గాష్టమి, యజ్ఞావల్క జయంతి, అక్షయ వ్రతం, జగద్ధాతి పూజ, ప్రభోధిని ఏకాదశి, కొస వధ, భీష్మపంచకం, తులసీ వివాహం, వైష్ణవ దేవుత్థాన ఏకాదశి, యోగేశ్వర ద్వాదశి, విశ్వేశ్వరయ్య వ్రతం, ప్రదోష వ్రతం, మణికర్ణికా స్నానం, జ్వాలా తోరణం కార్తీక పూర్ణిమ, కార్తీక బహుళ ఏకాదశి, వృశ్చిక సంక్రాంతి, పోలి స్వర్గం లాంటి పలు పుణ్య గడియలను పాటిస్తూ 08 డిసెంబర్ రోజున కార్తీక మాసం ముగుస్తుంది.

కార్తీక మాసంలో భక్తులు సక్రమంగా పూజలు చేసి ఆధ్యాత్మిక ప్రయోజనాలను పొంది జీవితంలో శాంతి, సంతోషాలు, శ్రేయస్సు పొందాలని కోరుకుందాం.



-మధుపాళీ
9949700037

సామాన్యులకు అందుబాటు ధరల్లో నాణ్యమైన బియ్యం!

కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే సహించేది లేదు

ప్రత్యేక బియ్యం దుకాణాలను ప్రారంభించిన కలెక్టర్ కుమార్ దీపక్



ఆదిలాబాద్, నవంబర్ 10: మార్కెట్‌లో బియ్యం ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలకు ఊరట కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక బియ్యం దుకాణాలను అందుబాటులోకి తీసుకొచ్చిందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించి బియ్యాన్ని అధిక ధరలకు విక్రయించకుండా, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే నాణ్యమైన బియ్యం అందించడమే ఈ దుకాణాల ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. మంగళవారం లక్షెట్టిపేట పట్టణంలోని బీట్ బజార్‌లో శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక బియ్యం దుకాణాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఈ దుకాణాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం బీపీటీ బియ్యం కిలో రూ.52, హెచ్‌ఎంటీ రూ.73, జైశ్రీరామ్ రూ.74, జైశ్రీరామ్ పాత బియ్యం రూ.78 చొప్పున విక్రయించనున్నట్లు వివరించారు. లక్షెట్టిపేట ప్రజలకు ఈ నాలుగు రకాల బియ్యం శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ప్రీమియం నాణ్యత కలిగిన, నూకలు లేని బియ్యం, రెండు నుంచి మూడేళ్ల పాత బియ్యం కోరుకునే వారు తమ అభిరుచి, ధరలను బట్టి కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. అయితే ప్రీమియం బియ్యం ప్రభుత్వం నిర్ణయించిన ధరల పరిధిలోకి రావని, వాటిని కూడా అదే ధరలకు విక్రయించాలని దుకాణదారులపై ఒత్తిడి చేయకూడదని సూచించారు.

మంచిర్యాల జిల్లాలో మంచిర్యాల, బెల్లంపల్లి, ఇందారం, జైపూర్, చెన్నూరు, లక్షెట్టిపేట ప్రాంతాల్లో ప్రత్యేక బియ్యం దుకాణాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. సామాన్య ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని సరసమైన ధరలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలు ఈ దుకాణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జాయింట్ కలెక్టర్ రాములు, డీఎస్ఓ వేణు, లక్షెట్టిపేట ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ భూమేష్, డిప్యూటీ తహసీల్దార్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మాజీ మున్సిపల్ చైర్మన్ నలమాసు కాంతయ్య, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిలువేరు వైకుంఠం, ప్రధాన కార్యదర్శి కొత్త వెంకటేశ్వర్లు, కొత్త రాజేశం, ఐక్య వ్యాపార సంఘం అధ్యక్షుడు మైలారపు సుధాకర్, కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు తాటికొండ శ్రీనివాస్, వెంకటేశ్వర ట్రేడర్స్ యజమాని కొత్త శికుమార్, రైస్ మిల్లుల యజమానులు కొత్త జయప్రకాష్, పాలకుర్తి రామన్న, లచ్చన్న, విశ్వనాథం, గుండం రాజలింగు, గంప రాజేశం, వ్యాపారులు పల్లెల్లో సురేష్, మహేందర్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే 1,364 మందులకు సవరించిన గరిష్ఠ చిల్లర ధరలు నేటి నుంచి అమలు

న్యూఢిల్లీ, నవంబర్ 10:క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే 137 మందులకు గరిష్ఠ చిల్లర విక్రయ ధర (ఎమ్ఆర్‌పీ)లో ట్రేడ్ మార్జిన్‌పై పరిమితిని విధించారు. రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖకు చెందిన ఔషధ నిర్మాణ విభాగం ఆధీనంలో పనిచేసే జాతీయ ఔషధాల ధరల ఖరారు ప్రాధికార సంస్థ (ఎన్‌పీపీఏ) ఈ మేరకు నిర్ణయించింది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సిఫారసుల ఆధారంగా ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఆయా మందులకు సవరించిన ఎమ్ఆర్‌పీలు ఈ రోజు, అంటే 2026 నవంబర్ 9 నుంచి అమల్లోకి వచ్చాయి.

2026 నవంబర్ 8 నాటికి 85 మందుల కంపెనీలు 121 ఔషధాలు సహా 1,364 క్యాన్సర్ చికిత్స ఉత్పాదనలకు సవరించిన ధరలను ప్రకటించాయి. వాటిలో 679 బ్రాండుల ధరలలో 50 శాతం కన్నా ఎక్కువ తగ్గింపు చోటు చేసుకుంది. అన్నింటి కన్నా ఎక్కువ తగ్గింపు 96.45 శాతంగా ఉంది. ధరలలో ఈ కోత ఫలితంగా, వినియోగదారులకు సంవత్సరానికి దాదాపు రూ.3,540.38 కోట్లు ఆదా అవుతాయని భావిస్తున్నారు.

మందుల ప్యాకెట్ పైన ముద్రించే గరిష్ఠ చిల్లర విక్రయ ధర (ఎమ్ఆర్‌పీ)ని వినియోగదారులు చూడవచ్చును. ‘ఫార్మా సహీ దామ్’ (ఖష్మజీతీఎజీ రాజీష్మతి ఆజీజీవీ) మొబైల్ యాప్ లో గాని, లేదా ఎన్‌పీపీఏ వెబ్‌సైట్ (నిజూజూజీ.ణనీల.తిని) ద్వారా గాని మందుల ధరలను సరిచూసుకోవచ్చును. సవరించిన ఎమ్ఆర్‌పీ కన్నా ఎక్కువ ధరను కెమిస్టు గాని, లేదా ఆస్పత్రి ఫార్మసీ గాని వసూలు చేయడానికి వీలు లేదు. ఒకవేళ వినియోగదారుల వద్ద నుంచి నిర్ధారిత ధర కన్నా ఎక్కువ ధరను తీసుకున్న పక్షంలో, అప్పుడు వారు ‘ఫార్మా జన్ సమాధాన్’ వెబ్‌సైట్ ద్వారా తమ ఫిర్యాదును దాఖలు చేయవచ్చును. లేదంటే ఎన్‌పీపీఏ హెల్ప్‌లైన్ 1800-111-255ను అయినా సంప్రదించవచ్చును.

మత్తుపదార్థ రహిత పండగ వేడుకలను ప్రోత్సహించేలా జాతీయ స్థాయి ‘దీవాళీ స్నేహ మిలన్’ నిర్వహించిన మై భారత్ -ఎన్ఎస్ఎస్

న్యూ ఢిల్లీ, నవంబర్ 10:వికసిత భారత్ 100 వారాల సంకల్ప్ అభియాన్‌లో భాగంగా నషా ముక్త యువ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో ‘దీవాళి స్నేహ మిలన్’ను మై భారత్-నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) నిర్వహించింది. దేశవ్యాప్తంగా 153 సంస్థల్లో చేపట్టిన ఈ కార్యక్రమంలో 1,07,494 మంది పాల్గొన్నారు. ఇది ఈ ప్రచారంలో ఎనిమిదో వారం. ఈ వారంతో ఈ కార్యక్రమం రెండు నెలలు పూర్తి చేసుకుంది. సామాజిక సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామూహిక ప్రతిజ్ఞలు, స్వచ్ఛంద సేవల ద్వారా వ్యసన రహిత దీపావళిని ప్రోత్సహించేందుకు సమాజంలోని యువతనూ, కుటుంబాలనూ, సమాజంలోని వ్యక్తులనూ ఈ కార్యక్రమం ఒక చోటకు చేర్చింది.

మాదక ద్రవ్యాల దుర్వినియోగాన్ని నివారించాలనే సందేశాన్ని విద్యాసంస్థలకే పరిమితం చేయకుండా గృహాలకూ, పరిసర ప్రాంతాలకూ విస్తరింపచేయడమే ఈ కార్యక్రమ లక్ష్యం. ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించడంలో, బాధ్యతాయుతమైన పండుగ వేడుకలను నిర్వహించడంలో సమష్టి బాధ్యత వహించేలా కుటుంబాలనూ, సమాజాలనూ ఇది ప్రోత్సహిస్తుంది. మిగిలిన విద్యాసంస్థల్లో సెలవుల అనంతరం కార్యక్రమాలు కొనసాగుతాయి.

నషా ముక్త్ దీపోత్సవ్‌లో భాగంగా వ్యసనం అనే చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా స్వచ్ఛంద కార్యకర్తలు, సమాజంలోని పెద్దలు, బాలలు మట్టి దీపాలను వెలిగించారు. ఈ దీపోత్సవం, స్నేహ మిలన్ సమావేశాలు రెండింటిలోనూ కలిపి 41,600 మందికి పైగా పాల్గొన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణలో సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేలా ఈ పర్యవసానాన్ని ఉపయోగించుకున్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంస్థలు ప్రాంతీయ భాషల్లో వీధి నాటకాలను ప్రదర్శించాయి. వీటితో పాటుగా ముగ్గులు వేయడం, నషా ముక్త పాటల కార్యక్రమాలను కూడా నిర్వహించాయి.

ఈ సాంస్కృతిక కార్యక్రమాల్లో 24,100 మందికి పైగా పాల్గొన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం తదితర అంశాల ప్రాధాన్యాన్ని తెలియజేయడానికి సంప్రదాయ, సృజనాత్మక కళారూపాలను ఉపయోగించారు.

ఈ సామూహిక కార్యక్రమాల్లో ‘వ్యసన రహిత దీపావళి సంకల్పం’ ప్రధాన భాగంగా నిలిచింది. దాదాపు 25,000 మంది వ్యక్తులు, కుటుంబ సభ్యులు మత్తుపదార్థాలకు దూరంగా దీపావళి నిర్వహించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. బాధ్యతాయుతమైన పండగ విధానాలను అవలంబించాలని, ఆరోగ్యకరమైన నిర్ణయాలు తీసుకునేలా యువతకు అండగా నిలవాలని ఈ ప్రతిజ్ఞ కుటుంబాలను ప్రోత్సహించింది.

‘నాట్ మీ, బట్ యూ’ అనే ఎన్ఎస్ఎస్ సిద్ధాంతానికి అనుగుణంగా పండగ వేడుకలతో పాటు సామాజిక సేవను కూడా వాలంటీర్లు చేపట్టారు. సేవా విభాగం పరిధిలోని 16,700 మందికి పైగా వాలంటీర్లు వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలు, ఆసుపత్రులు, మురికివాడలను సందర్శించారు. ప్రమిదలు, మిఠాయిలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమం కరుణ, సమ్మిళిత్వం, సామాజిక సేవ విలువలను ప్రతిబింబించింది.ఈ ప్రచారాన్ని మరింత విస్తృతం చేయడానికి యువ వాలంటీర్లు డిజిటల్ మాధ్యమాలను కూడా ఉపయోగించారు. వ్యసన రహిత దీపావళి సందేశాన్ని మరింత విస్తృతంగా ప్రచారం చేయడానికి చఔజీబష్మజీఓబీనిబిజబీలజీ హ్యాష్‌ట్యాగ్‌తో వీధి నాటకాలకు సంబంధించిన 1,100కి పైగా సోషల్ మీడియా పోస్టులు, రీల్స్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేశారు.

గోదావరి పుష్కరాలకు పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలి!

మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి..

మూడు రోజుల్లోగా పనుల అంచనాలు సమర్పించాలి: కలెక్టర్ సత్యప్రసాద్



కరీంనగర్, నవంబర్ 10: 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పుష్కరాలకు ముందుగానే అన్ని శాఖలు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈవై కన్సల్టెన్సీ రూపొందించిన ప్రాథమిక ప్రణాళికను క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేయాలన్నారు. పనులకు సంబంధించిన అంచనాలను నిర్ణీత నమూనాలో మూడు రోజుల్లోగా సమర్పించాలని ఆదేశించారు. ధర్మపురి గోదావరి తీరంలో స్నాన ఘాట్లు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, దుస్తులు మార్చుకునే గదులు, మంచినీటి సదుపాయాలు కల్పించేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పార్కింగ్ ప్రాంతాలు, షటిల్ బస్సులు, నడక మార్గాలు, ట్రాఫిక్ నియంత్రణకు పక్కా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

కన్సల్టెన్సీ ప్రతిపాదనల ప్రకారం ధర్మపురిలో 1,331.84 హెక్టార్ల పరిధిలో ఏర్పాట్లు చేయనున్నారు. ఈ ప్రాంతాన్ని 9 జోన్లు, 20 సెక్టార్లుగా విభజించి వివిధ శాఖలకు బాధ్యతలు కేటాయించేలా ప్రణాళిక రూపొందించారు. సుమారు 161 హెక్టార్లలో పార్కింగ్, 33 హెక్టార్లలో టెంట్ సిటీ, 10 హెక్టార్లలో హోల్డింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. సుమారు 800 మీటర్ల మేర గోదావరి ఘాట్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, బస్టాండ్ ఆధునీకరణ, ఆలయ పరిసరాల్లో వసతులు, పారిశుద్ధ్య సదుపాయాలు, జీవవైవిధ్య పార్కు అభివృద్ధి వంటి పనులను ప్రతిపాదించారు.

ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. పుష్కరాలకు భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్, సీసీ కెమెరాలు, అత్యవసర సేవలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. ప్రసూనాంబ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఈవై కన్సల్టెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

18న కరీంనగర్‌లో లక్ష మందితో మహా పాదయాత్ర!

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాక

కరీంనగర్ పేరు దేశవ్యాప్తంగా మారుమోగేలా ఏర్పాట్లు


కరీంనగర్, నవంబర్ 10: ఈనెల 18న కరీంనగర్‌లో లక్ష మందితో మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. మంగళవారం పాదయాత్ర ఏర్పాట్లపై చర్చించేందుకు తన ఎంపీ కార్యాలయంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కోర్ కమిటీ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జన సమీకరణ, పాదయాత్ర నిర్వహణ, ప్రచార కార్యక్రమాలపై నేతలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ‘సర్’ పేరిట రాజ్యాంగ సంస్థలపై విపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బీజేపీ ఆధ్వర్యంలో భారీ మహా పాదయాత్ర చేపడుతున్నట్లు వివరించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఈ పాదయాత్రలో పాల్గొంటారని తెలిపారు. జాతీయ అధ్యక్షు డిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలి సారిగా ఆయన కరీంనగర్‌కు వస్తుండటంతో ఈ కార్యక్ర మాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. కనీసం లక్ష మందితో పాదయాత్ర నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గాంధీ సర్కిల్, వైశ్య భవన్ నుంచి టవర్ సర్కిల్ మీదుగా కమాన్ వరకు పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. నితిన్ నబిన్‌తోపాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కార్యకర్తలు, ప్రజలతో కలిసి పాదయాత్రలో పాల్గొంటారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కరీంనగర్ పేరు చర్చనీయాంశమయ్యేలా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సన్నాహాలు చేయాలని సూచించారు.‘సర్’ అంశంపై కాంగ్రెస్, ఇండీ కూటమి నేతలు లేనిపోని ప్రచారం చేస్తూ ఎన్నికల సంఘం ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. రాజ్యాంగ సంస్థలపై దాడి చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ అంశంపై వాస్తవాలను ప్రజలకు వివరించేందుకే నితిన్ నబిన్ కరీంనగర్ పర్యటనకు వస్తున్నారని తెలిపారు. మహా పాదయాత్ర ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని కనీసం లక్ష మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. పార్టీ కార్యకర్తలతోపాటు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా పోలింగ్ బూత్ స్థాయి నుంచి శక్తి కేంద్రాలు, మండలాల వారీగా సమావేశాలు నిర్వహించాలని నేతలను కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటాం

దగ్ధమైన పూల దుకాణాలను పరిశీలించిన వ రాజీ ఎమ్మెల్యే గంద్ర వెంకటరమణారెడ్డి

ప్రభుత్వం తరపున ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ

కరీంనగర్, నవంబర్ 10:పట్టణంలోని గణేశ్ చౌక్‌లో ఫారెస్ట్ కార్యాలయం ఎదుట జాతీయ రహదారి ఫుట్‌పాత్‌పై తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకుని పూల వ్యాపారం చేసుకుంటున్న నాలుగు దుకాణాలు దీపావళి రోజు రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గంద్ర వెంకటరమణారెడ్డి బాధితులను పరామర్శించి, కాలిపోయిన షెడ్లను పరిశీలించారు. బాధితులను ప్రభుత్వం తరపున ఆదుకునేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వెంటనే రెవెన్యూ అధికారులకు ఫోన్ చేసి, నష్టపోయిన వ్యాపారులకు త్వరగా సహాయం అందించాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



హైదరాబాద్‌లోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో అంతర్జాతీయ వసతి గృహం

న్యూ ఢిల్లీ, నవంబర్ 10:హైదరాబాద్‌లోని బండ్లగూడ-నాగోల్‌లో ఉన్న జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (జీఎస్ఐ టీఐ)లో మూడు ప్రధాన వసతులైన అంతర్జాతీయ వసతి గృహం, అధునాతన జియోఫిజికల్ డేటా ప్రాసెసింగ్ ల్యాబొరేటరీ, డిజిటల్ స్టూడియోను 2026 నవంబర్ 10న ఉదయం 09:30 గంటలకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ప్రారంభిస్తారు.

జీఎస్ఐటీఐ శిక్షణ మౌలిక నదుపాయాలను బలోపేతం చేయడంతో పాటు అంతర్జాతీయ శిక్షణ, అధునాతన జియో సైంటిఫిక్ పరిశోధన, డిజిటల్ లెర్నింగ్ సామర్థ్యాలను పెంపొందించడంలో సాధించిన విజయాన్ని ఈ ప్రారంభోత్సవం సూచిస్తుంది.

అంతర్జాతీయ హాస్టల్ ప్రారంభోత్సవంతో ఈ కార్యక్రమం మొదలవుతుంది. అనంతరం అధునాతన జియోఫిజికల్ డేటా ప్రాసెసింగ్ ల్యాబొరేటరీని, డిజిటల్ స్టూడియోను ప్రారంభిస్తారు. డైరెక్టర్ జనరల్ శ్రీ దినేష్ వి. గన్వీర్ స్వాగతోపన్యాసం చేస్తారు. అనంతరం మల్కాజిగిరి లోక్‌సభ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ప్రసంగిస్తారు.

గనుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి ఫరీదా ఎం. నాయక్, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరవుతారు.

మూడు సరికొత్త సౌకర్యాల గురించి:

1. అంతర్జాతీయ వసతి గృహం (నలంద, తక్షశిల): జీఎస్ఐ అందించిన రూ. 4.27 కోట్ల నిధులతో దీనిని ఏర్పాటు చేశారు. దీనిలో భోజనశాల, రిక్రియేషన్ వసతులు, వ్యాయామశాల, మినీ-లైబ్రరీ, లాండ్రీ లాంటి ఆధునిక సదుపాయాలతో పాటు పూర్తి స్థాయిలో ఫర్నీచర్ ఏర్పాటు చేసిన 32 సూట్లు ఉన్నాయి. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) సూచనల ప్రకారం దీనిని అభివృద్ధి చేశారు. ఇది అంతర్జాతీయ శిక్షణార్థులకు సౌకర్యవంతమైన బసను కల్పించడంతో పాటు వృత్తివరమైన సంబంధాలను, సాంస్కృతిక వినిమయాన్ని, అంతర్జాతీయ సహకారాలను పెంపొందించడానికి తోడ్పడుతుంది.

2. అధునాతన జియోఫిజికల్ డేటా ప్రాసెసింగ్ ల్యాబరేటరీ: ఎన్ఎంఈడీటీ, జీఎస్ఐ సమకూర్చిన రూ.4.55 కోట్ల నిధులతో ఈ ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. దీనిలో 25 అత్యాధునిక కంప్యూటర్లు, ఆధునిక సాఫ్ట్‌వేర్ ఉన్నాయి. వీటిని ఖనిజాన్వేషణలో సామర్థ్యాన్ని బలోపేతం చేసేలా అధునాతన జియోఫిజికల్ డేటా ప్రాసెసింగ్, మోడలింగ్, ఇన్వర్షన్, నమూనా విశ్లేషణకు ఉపయోగిస్తారు.

3. డిజిటల్ స్టూడియో: సీబీసీ, జీఎస్ఐ అందించిన రూ.30 లక్షల వ్యయంతో ఈ స్టూడియోను ఏర్పాటు చేశారు. మిషన్ కర్మయోగికి అనుగుణంగా ఐజీపోటీ కర్మయోగి పోర్టల్ కోసం వీడియో పాఠాలు, పాడ్‌క్యాస్టులు, వెబినార్లతో సహా నాణ్యమైన డిజిటల్ లెర్నింగ్ వనరులను రూపొందించడానికి ఈ స్టూడియో వీలు కల్పిస్తుంది.

ఈ సౌకర్యాలు జీఎస్ఐటీఐ శిక్షణ మౌలికవసతులను, అంతర్జాతీయ సహకారాన్ని, డిజిటల్ లెర్నింగ్ సామర్థ్యాలను బలోపేతం చేస్తాయి.

జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గురించి...

రైల్వేల కోసం బొగ్గు నిక్షేపాలను అన్వేషించడానికి 1851లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ)ను స్థాపించారు. ఇది అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రముఖ భూ విజ్ఞాన సంస్థగా ఎదిగింది. జియోలాజికల్ సర్వేలు, అన్వేషణ, వివిధ విభాగాల అధ్యయనాలు, ప్రకృతి వివత్తులపై పరిశోధనలు, ప్రాథమిక భూగోళిక శాస్త్రాల ద్వారా జాతీయ భూవిజ్ఞాన సమాచారాన్ని సిద్ధం చేయడం, నవీకరించడం, ఖనిజ వనరులను అంచనా వేయడం ఈ సంస్థ ప్రధాన విధులు.

ఐదేళ్ల ప్రస్థానం.. ఆరో వసంతంలోకి సురక్ష ఆసుపత్రి!

నాణ్యమైన వైద్య సేవలతో ప్రజల మన్ననలు
అధికారిక వెబ్‌సైట్ ప్రారంభం.. ఇంటి నుంచే అపాయింట్‌మెంట్ల నమోదు
24 గంటలూ ఐదుగురు నిపుణులైన వైద్యుల సేవలు



కరీంనగర్, నవంబర్ 10:ప్రజలకు నాణ్యమైన, నమ్మకమైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ప్రారంభమైన సురక్ష మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఐదేళ్ల విజయవంతమైన ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని ఆరో వసంతంలోకి అడుగుపెట్టింది. ఐదేళ్లుగా భూపాలపల్లి ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ వారి ఆదరాభిమానాలను చూరగొంది. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో మరింత ఆధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ఆసుపత్రి యాజమాన్యం చర్యలు చేపట్టింది.

ఆసుపత్రి ఐదో వార్షికోత్సవ వేడుకల సందర్భంగా అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. సాంకేతికతను వినియోగించుకుంటూ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ నదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. వెబ్‌సైట్ ద్వారా రోగులు తమ ఇళ్ల నుంచే వైద్యుల అపాయింట్‌మెంట్లను సులభంగా నమోదు చేసుకోవచ్చు. ఆసుపత్రికి వచ్చి గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ముందుగానే వైద్యులను సంప్రదించేందుకు సమయాన్ని పొందవచ్చు.

అత్యవసర సమయాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 24 గంటలూ ఐదుగురు నిపుణులైన సంప్రదింపు వైద్యులను అందుబాటులో ఉంచుతున్నట్లు ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది. రోగుల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా వైద్య సేవలను మరింత విస్తృతం చేయనున్నట్లు పేర్కొంది.

ఐదేళ్ల ప్రస్థానంలో తమపై నమ్మకంతో వైద్య సేవలు పొందిన ప్రతి ఒక్కరికీ, నిరంతరం సేవలందిస్తున్న వైద్యులు, సిబ్బందికి ఆసుపత్రి యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ప్రజల నమ్మకమే తమ బలమని, భవిష్యత్తులోనూ నాణ్యమైన వైద్య సేవలను అందిస్తూ వారి ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తామని స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి, డాక్టర్ పద్మ ప్రవళిక, డాక్టర్ విశ్వకాంత్ తేజ, డాక్టర్ లింగమూర్తి, డాక్టర్ విక్రమ్, డాక్టర్ వంశీకృష్ణ, సిబ్బంది అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆకాశ దీపాన్ని వెలిగించిన జిల్లా కలెక్టర్!



ఖమ్మం, నవంబర్ 10: కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా ఖమ్మం నగరంలోని శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి స్వయంభూ శైవక్షేత్రంలో ఆకాశ దీపాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ప్రారంభించారు. స్థానిక ట్రంక్ రోడ్డులోని ఆలయంలో సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఆకాశ దీపాన్ని వెలిగించి కార్తీక మాస పూజలకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్తీక మాసం ఎంతో పవిత్రమైన మాసమని అన్నారు. ఈ మాసంలో శివకేశవులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. ఃకార్తీక మాస పర్వదినాల్లో ఉపవాస దీక్షలు ఆచరించడం ద్వారా ఆధ్యాత్మిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యవరమైన ప్రయోజనాలు కూడా పొందవచ్చని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామి, ఆలయ ఈవో చుండూరు రామకోటేశ్వరరావు, ప్రధాన అర్చకులు దామూలూరి కృష్ణశర్మ, ఆలయ ఉద్యోగి తోటకూరి వెంకటేశ్వర్లు, వీరభద్రశర్మ, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మాడిశెట్టి మదన్మోహన్, భక్తమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రైతులు, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కరువు పరిస్థితుల్లోనూ అభివృద్ధి, ఉపాధి కార్యక్రమాలకు వెనుకడుగు వేయం- ప్రభుత్వ విప్ వేముల వీరేశం

ఖమ్మం, నవంబర్ 10:రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నప్పటికీ అభివృద్ధి, ఉపాధి కార్యక్రమాలను కొనసాగిస్తామని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతులు, ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

చిట్యాల పట్టణంలో మంగళవారం ఎఫ్‌పీఓ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వేముల వీరేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని, రైతులు బయట మార్కెట్‌లో తక్కువ ధరకు విక్రయించవద్దని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొన్నాయని, వాటిని అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మూసీ, కృష్ణా జలాలతో నియోజకవర్గంలోని చెరువులను నింపేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ధర్మారెడ్డి కాల్వ పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేస్తామని వెల్లడించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

2025-26 స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో భాగంగా 10వ సంచిక పురస్కారాలను ప్రదానం చేయనున్న రాష్ట్రపతి

న్యూ ఢిల్లీ, నవంబర్ 10:న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో 2026 నవంబర్ 11న జరగనున్న కార్యక్రమంలో, 2025-26 స్వచ్ఛ్ సర్వేక్షణ్ పురస్కారాలను రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ప్రదానం చేస్తారు.

స్వచ్ఛ్ సర్వేక్షణ్ పదో సంచికను 'స్వచ్ఛతా కీ నయీ పహెల్ - బదాయేం హాథ్, కరేం సఫాయీ సాథ్' (స్వచ్ఛతతో ముడిపడిన కొత్త కార్యక్రమం - చేయి చాచండి, కలిసికట్టుగా శుభ్రంచేద్దాం) ఇతివృత్తం ఆధారంగా విజయవంతంగా పూర్తి చేశారు. గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన పట్టణాభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో 2025-26 స్వచ్ఛ్ సర్వేక్షణ్ (ఎస్ఎస్) పురస్కారాలను అందించి, అన్నింటి కన్నా స్వచ్ఛమైన నగరాలను గౌరవించనున్నారు. ఈ అవార్డులను ప్రదానం చేయడం ద్వారా 'స్వచ్ఛ్ భారత్ మిషన్-పట్టణ' (ఎస్‌బీ ఎమ్-యూ)కు ఆ నగరాలు అందించిన తోడ్పాటును గుర్తించనున్నారు. రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము వివిధ కేటగిరీల పురస్కారాలను న్యూఢిల్లీ లోని విజ్ఞ?న్ భవన్‌లో ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల (ఎమ్ఓహెచ్‌యూఏ) శాఖ, విద్యుత్తు శాఖ మంత్రి శ్రీ మనోహర్ లాల్‌తో పాటు ఎమ్ఓహెచ్‌యూఏ శాఖసహాయ మంత్రి శ్రీ తోఖన్ సాహూ కూడా పాల్గొంటారు.

గడచిన పది సంవత్సరాలలో నగరాలు, రాష్ట్రాలు సాధించిన సామూహిక విజయాలకు 2025-26 పురస్కారాలు ఒక గుర్తింపుగా నిలుస్తాయి. అంతేకాకుండా, క్షేత్ర స్థాయిలో నమోదు చేసిన ప్రగతిని ఇక మీదటా కొనసాగించడానికి సరికొత్త నిబద్ధతను కూడా చాటుతాయి.

'స్వచ్ఛ్ భారత్ మిషన్-పట్టణ' (ఎస్‌బీఎమ్-యూ)లో భాగంగా స్వచ్ఛతను మదింపు చేసే ఒక ప్రధాన కార్యక్రమమే 'స్వచ్ఛ్ సర్వేక్షణ్' (ఎన్ఎన్). దీని పరిధిలో 2016లో 73 పట్టణ స్థానిక సంస్థలు (యూఎల్‌బీస్) ఉండగా, తాజా సంచిక 4,751 నగరాలకు విస్తరించింది. 2025-26 స్వచ్ఛ్ సర్వేక్షణ్ పురస్కారాలలో అనేక కీలక సంస్కరణల్ని చేపట్టారు. వాటిలో.. పౌరుల అభిప్రాయాలకు మరింత ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇవ్వడం, సర్వేక్షణ పరిధిని పట్టణ నదీతీరాలు, కోస్తా ప్రాంతాలు, జలాశయాల వరకు విస్తరించడంతో పాటు, బహిరంగ ప్రదేశాలలో మల మూత్రాదుల విసర్జనను అరికట్టడం, పర్యటక, చరిత్రాత్మక ప్రదేశాల్లో స్వచ్ఛతను పరిరక్షించడం, పాఠశాలల్లో ప్రవర్తన పరమైన మార్పును తీసుకు వచ్చేందుకు ఉద్దేశించిన కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొనే సూచికాలు భాగంగా ఉన్నాయి.

స్వచ్ఛ్ సర్వేక్షణ్ (ఎస్ఎస్) 10వ సంచికలో భాగంగా పట్టణ స్థానిక సంస్థల (యూఎల్‌బీస్) మూల్యాంకనాన్ని 10 ప్రధాన రంగాల్లో 43 సూచకాల (ఇండికేటర్స్) ప్రాతిపదికన నిర్వహించారు. ఈ రంగాల్లో.. వ్యర్థాలను సేకరించడం, వేరు చేయడం, ఒక చోటు నుంచి మరొక చోటుకు చేరవేయడం, ఘన వ్యర్థాల నిర్వహణ, కంటికి కనపడే స్వచ్ఛత, స్వచ్ఛత సంబంధిత సదుపాయాలను అందుబాటులో ఉంచడం, బురద తొలగింపు సేవల్లో యంత్రాలను ఉపయోగించడం, విస్తృత అనుబంధ వ్యవస్థ పటిష్టీకరణ, సంస్థాగత కొలమానాలు, నీటి నిర్వహణ, స్వచ్ఛతకు సంబంధించిన విషయాలను తెలుసుకోవడం, పారిశుధ్య కార్మికుల సమగ్ర సంక్షేమం, పౌరుల అభిప్రాయాలను తెలుసుకోవడం, ఫిర్యాదులను పరిష్కరించడం వంటివి ఉన్నాయి. దేశవ్యాప్తంగా 3,000 కన్నా ఎక్కువ సుశిక్షిత మదింపుదారులు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా మూల్యాంకనాన్ని చేపట్టారు. ఈ ప్రక్రియకు తోడు, వాస్తవిక సమయంలో జీపీఎస్ పర్యవేక్షణ సాయాన్ని కూడా అందించారు. రుజువులను దాఖలు చేయడం మొదలు వాటిని సరిచూడడం వరకు, సంపూర్ణ మూల్యాంకన ప్రక్రియ ఆసాంతం డిజిటల్ మాధ్యమంలో, పారదర్శకంగా సాగింది. ప్రతి దశలో కఠిన నాణ్యత నియంత్రణకు ప్రాధాన్యాన్ని ఇచ్చారు.

స్వచ్ఛత రంగంలో అతి చక్కనైన పనితీరును కనబరిచిన నగరాలతో పాటు, ఈ సంవత్సరం పురస్కారాలలో 'స్వచ్ఛ్ శహర్ జోడీ' కార్యక్రమంలో భాగంగా అత్యున్నత ఫలితాలను నమోదు చేసిన నగరాలను సత్కరించనున్నారు. ఈ కార్యక్రమం 33 రాష్ట్రాలు, 191 మార్గదర్శక నగరాల మధ్య సమకాలిక శిక్షణను ప్రోత్సహించనుంది. దీంతో నగరాల్లో వ్యర్థపదార్థాల నిర్వహణ సంబంధిత నియంత్రణను మెరుగుపరిచేందుకు దోహదం లభించగలదని భావిస్తున్నారు. 'స్వచ్ఛ్ శహర్ జోడీ' కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి శ్రీ మనోహర్ లాల్ 2025 సెప్టెంబర్ 27న ప్రారంభించారు. ఇది నగర ప్రాంతాల వ్యర్థాల నిర్వహణలో మొదటి విహూత్న మార్గదర్శక, నమకాలిక శిక్షణాకార్యక్రమమని చెప్పవచ్చును. ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టిన సందర్భంగా, కార్యక్రమాన్ని శుభారంభం చేయడానికిగాను అన్ని అగ్రగామి నగరాలు, మార్గదర్శక నగరాల మధ్య ఒక అవగాహన నవూర్వక ఒప్పందాన్ని (ఎమ్ఓయూ) కుదిర్చారు.

2024 స్వచ్ఛ్ సర్వేక్షణ్, 2025 స్వచ్ఛ్ సర్వేక్షణ్‌కు మధ్య మార్గదర్శనాన్ని అందుకున్న నగరాల పనితీరులో స్వచ్ఛతతో ముడిపడిన ప్రధాన సూచకాల (ఇండికేటర్స్)లో చెప్పుకోదగ్గ మెరుగుదల చోటు చేసుకుంది. 2025-26 స్వచ్ఛ్ సర్వేక్షణ్ తాజా సంచికలో ఈ నగరాల పనితీరులో అనేక ప్రముఖ రంగాలలో గొప్ప మెరుగుదల నమోదైంది. మార్గదర్శనాన్ని అందుకున్న నగరాలలో 'కంటికి కనపడే స్వచ్ఛత' కొలమానం ప్రకారం పనితీరు 2024 స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో 48 శాతం కన్నా పెరిగి నూతన సంచికకు వచ్చే సరికి 70 శాతానికి చేరుకొంది. ఇదే విధంగా, 'ఇంటింటా చెత్త సేకరణ' కొలమానంలో ఈ నగరాల పనితీరు 2024 స్వచ్ఛ్ సర్వేక్షణ్ వేళ 52 శాతంగా ఉన్నది కాస్తా, ప్రస్తుతం ఎగబాకి 74 శాతానికి చేరింది. మార్గదర్శనాన్ని అందుకున్న నగరాలు ఇతర ప్రధాన రంగాల్లో కూడా చెప్పుకోదగిన మెరుగుదలను నమోదు చేశాయి. వాటిలో.. మూలం వద్దే చెత్తను వేరు చేసే ప్రక్రియ (16 శాతం నుంచి ఎగిసి 30 శాతానికి చేరడం), స్వచ్ఛత సదుపాయాల వరకు చేరిక (11 శాతం నుంచి పెరిగి 38 శాతానికి చేరుకోవడం), ఒకసారి వాడిన జలాల నిర్వహణ (32 శాతం స్థాయి నుంచి 53 శాతానికి చేరిక), స్వచ్ఛత సంబంధిత విషయాల పట్ల అవగాహన (48 శాతం నుంచి 66 శాతానికి వృద్ధి చెందడం) భాగంగా ఉన్నాయి. ఈ మెరుగుదల స్వచ్ఛత వ్యవస్థలను బలోపేతం చేయడం, ఉన్నత పనితీరును కనబరిచిన నగరాల నుంచి నిరంతర ప్రాతిపదికన మార్గదర్శనాన్ని పొందుతుడటం ద్వారా సేవల అందజేతలో నాణ్యత మెరుగు పడటాన్ని సూచిస్తున్నాయి. ఒక ఏడాది పాటు నిరంతర ప్రయత్నాలు, ఆరోగ్యకరమైన పోటీ, స్వచ్ఛత పరిరక్షణ పట్ల అచంచల నిబద్ధత కనబరిచిన తరువాత, ఇప్పుడు దేశవ్యాప్త నగరాలు 2026 నవంబర్ 11న '2025-26 స్వచ్ఛ్ సర్వేక్షణ్ పురస్కారాల' విజేతల ప్రకటన ఎప్పుడెప్పుడా అని ఆసక్తితో ఎదురుచూస్తున్నాయి.

చెన్నైలో భారత్-మయన్మార్ తొలి త్రివిధ దళాల ద్వైపాక్షిక హెచ్‌ఏడీఆర్ విన్యాసం 'రహత్ మిత్ర' ముగింపు

న్యూఢిల్లీ, నవంబర్ 10:భారత్, మయన్మార్ రక్షణ దళాల మధ్య తొలిసారిగా నిర్వహించిన ద్వైపాక్షిక త్రివిధ దళాల మానవతా సహాయం, విపత్తు సహాయక విన్యాసం (హెచ్‌ఏడీఆర్) 'రహత్ మిత్ర' 2026 నవంబర్ 5, 6 తేదీల్లో చెన్నైలో విజయవంతంగా ముగిసింది. రెండు రోజులపాటు జరిగిన ఈ విన్యాసంలో భారత నావికాదళం, భారత సైన్యం, భారత వైమానిక దళాల సిబ్బందితో పాటు మయన్మార్ రక్షణ దళాల ప్రతినిధి బృందం పాల్గొంది. విపత్తుల సమయంలో చేపట్టే సహాయక చర్యల్లో కార్యాచరణ పరస్పర సమన్వయాన్ని పెంపొందించడం, సమన్వయాన్ని మెరుగుపరచడం, విపత్తు ప్రతిస్పందన కార్యకలాపాల్లో ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకోవడం ఈ విన్యాసం ప్రధాన లక్ష్యాలు.

ఉమ్మడి ప్రణాళిక రూపకల్పన, మానవతా సహాయం, విపత్తు సహాయక చర్యల్లో (హెచ్‌ఏడీఆర్) అందుబాటులో ఉన్న సామర్థ్యాలపై అవగాహనతో ఈ విన్యాసం ప్రారంభమైంది. తీవ్ర తుపాను పరిస్థితిని ఆధారంగా చేసుకుని నిర్వహించిన టేబుల్‌టాప్ విన్యాసం (టీటీఎక్స్) ద్వారా సమన్వయంతో స్పందించే విధానాలు, ఉమ్మడి విపత్తు నిర్వహణ ప్రణాళికలపై చర్చలు జరిగాయి. భారత సైన్యం ప్రదర్శించిన అడ్డంకుల తొలగింపు, వంతెనల నిర్మాణ సామర్థ్యాలను పాల్గొన్న బృందాలు వీక్షించాయి. అలాగే భారత నావికాదళం నౌకల ద్వారా అందించే విపత్తు సహాయక సామర్థ్యాలను తెలుసుకునేందుకు ఐఎన్ఎస్ సుకన్యను సందర్శించాయి.

రెండో రోజు భారత రక్షణ దళాలు సముద్ర, భూమి, వాయు మార్గాల్లో సమన్వయంతో చేపట్టే బహుళ రంగ మానవ, విపత్తు సహాయక చర్యల సామర్థ్యాలను ప్రదర్శించాయి. చెన్నైలోని ఐఎన్ఎస్ అడయార్, కమ్యూనికేషన్ నెట్‌వర్క్ కేంద్రం ద్వారా తీర ప్రాంతాల నుంచి చేపట్టే విపత్తు ప్రతిస్పందన ఏర్పాట్లు, అత్యవసర పరిస్థితుల్లో కమాండ్-కంట్రోల్‌కు తోడ్పడే సమాచార వ్యవస్థలను ప్రదర్శించారు. చెన్నై మిలిటరీ ఆసుపత్రి క్షేత్రస్థాయిలో వైద్యపరమైన ప్రాథమిక వర్గీకరణ (ట్రయాజ్), విపత్తు సహాయక శిబిరాల నిర్వహణలో సమన్వయ విధానాలను వివరించింది.భారత నావికాదళానికి చెందిన వరద సహాయక బృందాలు (ఎఫ్ఆర్‌టీ) వరద సహాయక చర్యల్లో ఉపయోగించే ప్రత్యేక పరికరాలు, తమ సామర్థ్యాలను ప్రదర్శించాయి. చేతక్ హెలికాప్టర్, ఐఎన్ఎస్ బిట్రా సమన్వయంతో నిర్వహించిన విన్యాసాల ద్వారా సముద్రంలో గాలింపు, రక్షణ (ఎస్ఏఆర్) సామర్థ్యాలను కూడా ప్రదర్శించారు. భారత వైమానిక దళం క్షతగాత్రులను తరలించే సామర్థ్యాలను ప్రదర్శించింది. వైమానిక విన్యాసాల సమయంలో మయన్మార్ ప్రతినిధి బృందానికి చెందిన కమోడోర్ ఆంగ్ నియాంగ్ విన్, మరో ఇద్దరు అధికారులు భారత వైమానిక దళానికి చెందిన ఏఎల్‌హెచ్ హెలికాప్టర్‌లో ప్రయాణించారు.'రహత్ మిత్ర' విన్యాసం ఇరు దేశాల రక్షణ దళాలకు కార్యా చరణ అనుభవాలను పరస్పరం పంచుకోవడానికి, ఉత్తమ విధానాలను తెలుసుకోవడానికి, విపత్తు సహాయక చర్యల ప్రణాళిక, అమలులో పరస్పర అవగాహనను పెంపొందించుకోవడానికి కీలక వేదికగా నిలిచింది. ఒకరి సామర్థ్యాలు, విధానాలపై మరొకరు అవగాహన పెంచుకునేందుకు ఈ విన్యాసం దోహదపడింది. తద్వారా విపత్తుల సమయంలో సమన్వయంతో స్పందించే సామర్థ్యం మెరుగుపడనుంది.



అక్రమ అరెస్టులతో వికలాంగుల ఉద్యమాన్ని ఆపలేరు!

నల్గొండ, నవంబర్ 10: అక్రమ అరెస్టులతో వికలాంగుల ఉద్యమాన్ని అణచివేయలేరని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి మోతె మండల అధ్యక్షుడు జిల్లపల్లి శివకృష్ణ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోడంగల్ పర్యటన నేపథ్యంలో వికలాంగుల ఉద్యమ నాయకుడు జిల్లపల్లి శివకృష్ణతో పాటు సంఘం నాయకులను సోమవారం మోతె పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా శివకృష్ణ మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. హామీలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.వికలాంగుల పింఛన్ల పెంపు, ఉద్యోగాల కల్పన, సంక్షేమ పథకాల అమలు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. వికలాంగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని జిల్లపల్లి శివకృష్ణ హెచ్చరించారు.

పుట్టగొడుగులు వేళ్లూనుకునే చోట, జీవనోపాధులు రూపుదిద్దుకుంటాయి



న్యూ ఢిల్లీ, నవంబర్ 10:ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై పెరుగుతున్న ఆసక్తితో, భారతదేశ ఉద్యానవన రంగంలో పుట్టగొడుగుల సాగు ప్రాముఖ్యతను సంతరించుకుంటోంది మరియు మరింత వృద్ధికి ఆస్కారం కల్పిస్తోంది. పుట్టగొడుగులు వాటి పోషక విలువలకు ప్రసిద్ధి చెందాయి; వీటిలో సాధారణంగా కేలరీలు, కొవ్వు మరియు కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి, అదే సమయంలో ప్రోటీన్, పీచుపదార్థం, విటమిన్లు మరియు ఖనిజాలను అందిస్తాయి. వీటిని పరిమిత భూమిలో, గ్రామీణ, పట్టణ మరియు పట్టణ శివారు ప్రాంతాలలో సాగు చేయవచ్చు.

ఒక చిన్న స్థలం, కొన్ని పుట్టగొడుగుల సాగు సంచులు మరియు ఒక కొత్త నైపుణ్యం విభిన్న జీవనోపాధి అవకాశాలకు మార్గాలను సృష్టించగలవు. భారతదేశం అంతటా, పుట్టగొడుగుల సాగు రైతులు, మహిళలు మరియు గ్రామీణ యువతకు ఒక ఆచరణీయమైన జీవనోపాధి మార్గంగా ఆవిర్భవిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా, ఇప్పటం గ్రామానికి చెందిన రుత్తుకు, ప్రత్యామ్నాయ జీవనోపాధి కోసం అన్వేషణతో ఈ ప్రయాణం ప్రారంభమైంది. 20 ఏళ్ల వయసులో, ఆమె చెత్త ఏరుకునే పని చేస్తూ, స్వతంత్రంగా జీవనోపాధిని ఏర్పరచుకోవాలని ఆకాంక్షించింది.

గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ (గ్రామీజ) చొరవ కింద నిర్వహించిన ఒక స్వల్పకాలిక శిక్షణా కార్యక్రమం ద్వారా ఈ అవకాశం లభించింది. గుంటూరులోని కృషి విజ్ఞాన్ కేంద్రం (ఐఎఐ), కంపోస్టింగ్, స్పానింగ్, కేసింగ్, పిన్నింగ్, పంట వేయడం మరియు కోత వంటి కీలక దశలను కవర్ చేస్తూ పుట్టగొడుగుల ఉత్పత్తిలో శిక్షణను అందించింది. ఆంధ్రప్రదేశ్‌లోని రాష్ట్ర వ్యవసాయ నిర్వహణ మరియు విస్తరణ శిక్షణా సంస్థ (గాంఓఇఎ) మరియు హైదరాబాద్‌లోని జాతీయ వ్యవసాయ విస్తరణ నిర్వహణ సంస్థ (ఓంఔఉఇ) సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.కేసింగ్ అంటే పుట్టగొడుగుల ఏర్పాటును ప్రోత్సహించడానికి, స్పాన్ కలిపిన తర్వాత కంపోస్ట్‌పై కేసింగ్ మట్టి పొరను వేయడం. ఈ కేసింగ్ మట్టి తేమకు నిల్వగా పనిచేసి, తేమను నిలుపుకోవడానికి మరియు పుట్టగొడుగుల పెరుగుదలకు అనువైన పరిస్థితులను కల్పించడానికి సహాయపడుతుంది. పిన్నింగ్ అంటే కేసింగ్ ఉపరితలంపై లేదా దాని సమీపంలో పిన్‌హెడ్స్ అని పిలువబడే చిన్న పుట్టగొడుగుల నిర్మాణాలు కనిపించడం ప్రారంభమయ్యే దశ.

భారతదేశంలో, చాలా మంది రైతులు పరిమిత పెట్టుబడితో చిన్న మరియు సన్నకారు కమతాలను నిర్వహిస్తారు. పుట్టగొడుగుల సాగు వారికి ఒక ఆచరణీయమైన మార్గాన్ని అందిస్తుంది, ఎందుకంటే ఇది వ్యవసాయ వ్యర్థాలను పెరుగుదలకు మాధ్యమంగా ఉపయోగిస్తుంది మరియు అనేక సాంప్రదాయ వ్యవసాయ కార్యకలాపాల కంటే దీనికి తక్కువ భూమి, నీరు మరియు ఆర్థిక పెట్టుబడి అవసరం. వనరుల వినియోగం, ఉపాధి కల్పన, సుస్థిరత మరియు పోషకాహార భద్రత వంటి కీలకమైన ఆందోళనలను పరిష్కరిస్తూ, ఇది ఒక వ్యవసాయ వ్యాపార సంస్థగా కూడా సామర్థ్యాన్ని అందిస్తుంది.

శిక్షణ సమయంలో పొందిన నైపుణ్యాలను ఉపయోగించి, రుతు మిల్కీ పుట్టగొడుగుల సాగును ప్రారంభించి, స్థానిక మార్కెట్‌కు క్రమం తప్పకుండా సరఫరా చేయడం మొదలుపెట్టింది. ఆమె ఉత్పత్తి రోజుకు సుమారు 8 కిలోలకు చేరుకుంది, దీని ద్వారా ఆమెకు నెలకు దాదాపు ?35,000 ఆదాయం వస్తోంది. సాగు సమయంలో సరైన ఉష్ణోగ్రత మరియు తేమ స్థాయిలను పాటిస్తూ, వ్యాధి రహిత శుభ్రమైన వరి గడ్డిని మరియు మంచి నాణ్యత గల స్పాన్‌ను ఉపయోగించడం యొక్క ప్రాముఖ్యతను కూడా ఆమె నేర్చుకుంది. ఆమె నేర్చుకున్న విషయాలు మరియు అనుభవాలు, ఆమె మార్గదర్శకత్వం మరియు మద్దతుతో మరో ముగ్గురు నలుగురు కమ్యూనిటీ సభ్యులను చిన్న స్థాయిలో పుట్టగొడుగుల సాగు చేపట్టడానికి ప్రోత్సహించాయి.

లక్షిత నైపుణ్యాభివృద్ధిని ఆచరణాత్మక అనువర్తనంగా మార్చినప్పుడు, అది జీవనోపాధి వైవిధ్యీకరణకు మరియు స్థానిక జ్ఞాన భాగస్వామ్యానికి ఎలా మద్దతు ఇస్తుందో రుతు అనుభవం వివరిస్తుంది. ఒక చిన్న శిక్షణా కార్యక్రమంగా ప్రారంభమైనది, ఆదాయ సృష్టికి పునాదిగా మారి, సమాజంలోని ఇతరులను పుట్టగొడుగుల సాగును ఒక జీవనోపాధి మార్గంగా అన్వేషించేలా ప్రోత్సహించింది.

ధాన్యం కొనుగోళ్లపై అంక్షలు ఎత్తివేయాలి

రైతులకు మద్దతు ధర కల్పించాలి.. బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

నిజామాబాద్, నవంబర్ 10:తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తూ, వివిధ ఆంక్షల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రైస్ మిల్లర్లతో కుమ్మక్కై ధాన్యం ధరలను తగ్గిస్తున్నారని, ప్రభుత్వ పర్యవేక్షణ లోపంతో దళారులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తూ రైతులను నష్టపరుస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోళ్లపై అనవసర ఆంక్షలను ఎత్తివేయాలని, కొనుగోలు కేంద్రాల ద్వారా వేగంగా ధాన్యం సేకరించాలని డిమాండ్ చేశారు.

మిల్లర్ల సిండికేట్ దోపిడీని అరికట్టి రైతులకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతుల పక్షాన పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎన్ నాయకులు భూంరెడ్డి, రవీందర్‌రెడ్డి, పోతిరెడ్డి, అనంతగౌడ్, స్వామి, జిల్లెల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

100 వారాల మాదక ద్రవ్య వ్యతిరేక ప్రచారంలో భాగంగా మై భారత్ దేశవ్యాప్త దీపోత్సవ్ మరియు స్థానిక యువజన పార్లమెంట్‌ల నిర్వహణ



న్యూ ఢిల్లీ, నవంబర్ 10:యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మేరా యువ భారత్ (మై భారత్), 'నషా ముక్త్ యువ భర్ విక్సిత్ భారత్' 100 వారాల సంకల్ప్ అభియాన్‌లో భాగంగా 8వ వారంలో, నవంబర్ 6 మరియు 7, 2026 తేదీలలో దేశవ్యాప్తంగా 'నషా ముక్త్ యువ దీపోత్సవ్ ? ఏక్ దియా సంకల్ప్ కా' మరియు 'నషా ముక్త్ యువ పర్ పరిచయ్' కార్యక్రమాలను స్థానిక యువజన పార్లమెంట్‌ల ద్వారా నిర్వహించింది.

ఈ రెండు కార్యక్రమాలు దీపావళి వేడుకలను, మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై క్షేత్రస్థాయి చర్చలతో మిళితం చేసి, 30 రాష్ట్రాల నుండి 1.19 లక్షలకు పైగా యువత మరియు పౌరులను సమీకరించాయి.

నషా ముక్త్ భారత్ దిశగా ప్రతిజ్ఞలు తీసుకుంటున్న రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు.

'నషా ముక్త్ యువ దీపోత్సవ్ ? ఏక్ దియా సంకల్ప్ కా' చొరవ కింద, 1,10,101 మంది ప్రజల భాగస్వామ్యంతో 435 కార్యక్రమాలు మరియు 568 కార్యకలాపాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యకలాపాలలో రంగోలి ఏర్పాటు, దీపాలు వెలిగించడం, మిఠాయిల పంపిణీ, అవగాహన కార్యక్రమాలు మరియు మై భారత్ వాలంటీర్లను సన్మానించడం వంటివి ఉన్నాయి. బ్రహ్మ కుమారీస్, ఈపీఎస్ఐ మరియు హార్ట్‌ఫుల్‌నెస్ వంటి భాగస్వామ్య సంస్థలు కూడా పాల్గొన్నాయి.

ఉత్తరప్రదేశ్‌లో, మై భారత్ లక్నోలో వాలంటీర్లతో కలిసి వేడుకలను నిర్వహించింది, బందాలోని ఒక వృద్ధాశ్రమంలో మిఠాయిలు మరియు పండ్లను పంపిణీ చేసింది, మరియు రాంపూర్‌లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. ఛత్తీస్‌గఢ్‌లో, ముంగేలి మరియు ధమతరిలో దీపోత్సవం మరియు రంగోలి కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. హిమాచల్ ప్రదేశ్‌లో, కాంగ్రాలోని ఒక వృద్ధాశ్రమంలో వేడుకలు మరియు మిఠాయిల పంపిణీ నిర్వహించబడ్డాయి. మహారాష్ట్రలోని యవత్మల్; పుదుచ్చేరిలోని యానాం; మరియు జమ్మూ కాశ్మీర్‌లో కూడా ఇలాంటి కార్యక్రమాలు జరిగాయి.

బ్లాక్ స్థాయిలో నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ల ద్వారా నిర్వహించబడిన 'నషా ముక్త్ యువ పర్ పరిచయ' చొరవలో, 9,526 మంది వ్యక్తుల భాగస్వామ్యంతో 85 కార్యక్రమాలు మరియు 298 కార్యకలాపాలు నమోదయ్యాయి. ఈ చర్చలు మాదకద్రవ్యాల దుర్వినియోగం, దాని సవాళ్లు మరియు మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్రపై దృష్టి సారించాయి.

ప్రతి ఎన్‌వైపి నాలుగు నిర్మాణాత్మక సెషన్‌ల ద్వారా ప్రతి బ్లాక్‌లో కనీసం 80 మంది యువతను భాగస్వామ్యం చేసేలా రూపొందించబడింది. వీటిలో మై భారత్ పోర్టల్‌పై సంక్షిప్త సమాచారం; 'మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అర్థం చేసుకోవడం: భారతదేశ యువత ఎదుర్కొంటున్న సవాళ్లు'; 'అవగాహన నుండి కార్యాచరణ వరకు: నషా ముక్త్ యువ కోసం సాధనాలు'; మరియు 'మార్పు కథలు: నషా ముక్త్ భారత్ వైపు ప్రయాణం' అనే శీర్షికతో ఒక ఆడియో-విజువల్ ప్రజెంటేషన్ ఉన్నాయి.

పరిశుభ్రతను పెంపొందించడానికి మరియు పెండింగ్‌లో ఉన్న విషయాలను పరిష్కరించడానికి స్పెషల్ క్యాంపెయిన్ 6.0



న్యూ ఢిల్లీ, నవంబర్ 10:క్రీడా శాఖ, తన పరిధిలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా , లక్ష్మీబాయి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ , నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ , నేషనల్ యాంటీ-డోపింగ్ ఏజెన్సీ, మరియు నేషనల్ డోప్ టెస్టింగ్ లాబొరేటరీ వంటి సంస్థలతో కలిసి, పరిపాలనా సంస్కరణలు డ ప్రజా ఫిర్యాదుల శాఖ యొక్క స్పెషల్ క్యాంపెయిన్ 6.0కు గణనీయమైన సహకారాన్ని అందించింది.

2026 అక్టోబర్ 2 నుండి అక్టోబర్ 31 వరకు నిర్వహించిన ఈ క్యాంపెయిన్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం, బాధ్యతాయుతమైన పాలనను నిర్ధారించడం, పరిపాలనా ప్రక్రియలను క్రమబద్ధీకరించడం మరియు శాస్త్రీయ పద్ధతిలో ఇ-వ్యర్థాలను నిర్వహించడం. ఇ-వ్యర్థాలను "సమర్థవంతంగా సేకరించడం, వేరు చేయడం మరియు పారవేయడం" అనే లక్ష్యంతో, క్రీడా శాఖ స్ఫూర్తిలో స్వచ్ఛత (పరిశుభ్రత) సూత్రాలను పాదుకొల్పడం దీని ప్రధాన విధి.

రోజువారీ శారీరక దృఢత్వాన్ని, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు, "స్వచ్ఛ భారత్, స్వస్థ భారత్" అనే నినాదాలను అనుసంధానిస్తూ, క్రీడల శాఖ 2026 అక్టోబర్ 2న 'ఫిట్ ఇండియా స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్'ను ఉత్సాహభరితంగా ప్రారంభించి ఈ ప్రయత్నాన్ని మొదలుపెట్టింది. ఈ ప్రచార కార్యక్రమం సందర్భంగా, ఈ శాఖ పార్లమెంట్ సభ్యుల నుండి పెండింగ్‌లో ఉన్న 15 సూచనలను, 4 రాష్ట్ర ప్రభుత్వ సూచనలను సమర్థవంతంగా పరిష్కరించింది. అలాగే 120 ప్రజా ఫిర్యాదులను, 2 పీఎంఓ సూచనలను పరిష్కరించి, 3 పార్లమెంటరీ హామీలను నెరవేర్చింది. ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణ వల్ల ప్రతి లక్ష్యం కచ్చితత్వంతో, సకాలంలో, అర్థవంతమైన ఫలితాలతో సాధించబడిందని నిర్ధారించబడింది. ఈ ప్రచారం భౌతిక మరియు డిజిటల్ ఫైల్ నిర్వహణను కూడా చేపట్టింది. అమలు దశలో 290 భౌతిక ఫైళ్లను సమీక్షించారు. అంతేకాకుండా, ఈ ప్రచారం ద్వారా 340 ఇ-ఫైళ్ల సమీక్ష పూర్తయింది, ఇది డిజిటల్ రికార్డుల నిర్వహణలో శాఖ సాధించిన ఒక గణనీయమైన ముందడుగు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

బోయినపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ మహేశ్ బి.గితే

కరీంనగర్, నవంబర్ 10:పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి.గితే సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బోయినపల్లి పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందుతున్న పోలీస్ సేవలను పర్యవేక్షించడంలో భాగంగా ఈ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించారు. ప్రతి కేసులో నిబంధనల ప్రకారం సమర్థవంతంగా దర్యాప్తు చేపట్టి, పెండింగ్



కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్ రికార్డులు, కేసు డైరీలు, వివిధ రిజిస్టర్లను తనిఖీ చేశారు.

పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలతో వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చట్టపరిధిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. నేర నియంత్రణకు పెట్రోలింగ్, రాత్రి గస్తీని ముమ్మరం చేయాలని, రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. గంజాయి, డ్రగ్స్, ఇతర నిషేధిత పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా గ్రామాలు, విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ, కేవైసీ మోసాలు, నకిలీ పెట్టుబడి యాప్‌లు, డిజిటల్ అరెస్టులపై ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టడంతోపాటు హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రమాదకర డ్రైవింగ్, మైనర్ల వాహన వినియోగం, మోడిఫైడ్ సైలెన్సర్ల వినియోగంపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రమాకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు

మెదక్, నవంబర్ 10: తెలంగాణ ప్రభుత్వం మరో కీలక సంక్షేమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే లక్ష్యంతో రూపొందించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 19న సిద్దిపేటలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. అదే వేదికపై ఇందిరమ్మ చీరల పంపిణీ రెండో విడత కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సభ నిర్వహణకు అనువైన ప్రాంతాల ఎంపికపై మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ప్రభుత్వ చీఫ్ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు కూడా ఈ పరిశీలనలో పాల్గొన్నారు. సభకు భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండటంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. సభా ప్రాంగణం ఎంపికతో పాటు వాహనాల పార్కింగ్, వీఐపీ పార్కింగ్, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, రాకపోకల మార్గాలపై చర్చించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం అమలులో భాగంగా నవంబర్ 20 నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ చేపట్టనున్నారు.

భారతదేశపు నీలి ఆర్థిక వ్యవస్థ ప్రోత్సాహంలో ద్వీప మత్స్య సంపద కేంద్రబిందువు

న్యూఢిల్లీ, నవంబర్ 10:భారతదేశం సుమారు 11,099 కిలోమీటర్ల తీరప్రాంతం మరియు దాదాపు 24 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రత్యేక ఆర్థిక మండలం మద్దతుతో విస్తారమైన మరియు విభిన్నమైన సముద్ర వనరుల సంపదను కలిగి ఉంది. దాని ఇఇజడ్ పరిధిలో 58.6 లక్షల మెట్రిక్ టన్నుల అంచనా సముద్ర మత్స్య సంపద సామర్థ్యంతో, ఈ రంగం దాదాపు 50 లక్షల మంది మత్స్యకారుల జీవనోపాధిని నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తూ, ఆహార భద్రత, పోషణ, ఉపాధి, ఆదాయ సృష్టి మరియు ఎగుమతి ఆదాయాలకు గణనీయంగా దోహదపడుతుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సుమారు 73,890 కోట్ల విలువైన సముద్రపు ఆహార ఎగుమతులతో, భారతదేశం నేడు ప్రపంచవ్యాప్తంగా అగ్రగామి మత్స్య మరియు ఆక్వాకల్చర్ ఉత్పత్తి చేసే దేశాలలో ఒకటిగా నిలుస్తోంది. ఇది జాతీయ ఆర్థిక వ్యవస్థలో మరియు ప్రపంచ సముద్రపు ఆహార వాణిజ్యంలో ఈ రంగం యొక్క పెరుగుతున్న ప్రాముఖ్యతను నొక్కి చెబుతోంది. భారతదేశ మత్స్య రంగం కేవలం ఉత్పత్తిపై దృష్టి సారించే కార్యకలాపం నుండి, జాతీయ ఆర్థిక వ్యవస్థలో ఒక చైతన్యవంతమైన, సాంకేతికత ఆధారిత మరియు విలువ-ఆధారిత స్తంభంగా పరిణామం చెందుతోంది. 2015 నుండి, భారత ప్రభుత్వం కీలక పథకాలు మరియు కార్యక్రమాల ద్వారా మత్స్య రంగంలో రూ. 39,272 కోట్లు కేటాయించి, ప్రభుత్వ పెట్టుబడులను గణనీయంగా పెంచింది.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కు

పోలీస్ భద్రత వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున అందజేత

చెక్కును అందించిన జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి. పాటిల్

మహబూబ్‌నగర్, నవంబర్ 10:గత సంవత్సరం రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఏఆర్ కానిస్టేబుల్ రామస్వామి కుటుంబానికి పోలీస్ భద్రత వెల్ఫేర్ అసోసియేషన్ మంజూరు చేసిన రూ.5 లక్షల వ్యక్తిగత బీమా చెక్కును జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ అందజేశారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ చెక్కును మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అకాల మరణం చెందిన పోలీస్ సిబ్బంది కుటుంబాలను ఆదుకోవడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఏఆర్ కానిస్టేబుల్ రామస్వామి సేవలను గుర్తుచేసుకుంటూ, ఆయన కుటుంబానికి పోలీస్ శాఖ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



అక్రమ వ్యాపారంపై డీఆర్ఐ కొనసాగిస్తున్న ఉక్కు చర్య



న్యూ ఢిల్లీ, నవంబర్ 10:నిర్దిష్ట సమాచారం మేరకు, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు ఇ-సిగరెట్లు ఉన్నాయని అనుమానించిన ఒక దిగుమతి సరుకును అడ్డగించారు. అందులోని సరుకును "మాప్ రాడ్"గా తప్పుగా ప్రకటించారు. కంటైనర్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేయగా, ప్రకటించిన మాప్ రాడ్ (హ్యాండిల్) సరుకు మధ్యలో, కంటైనర్ చివరన దాచి ఉంచిన 6,000 "యుటో థానోస్" ఇ-సిగరెట్లు, 7,000 "యుటో లెన్స్" బ్రాండెడ్ ఇ-సిగరెట్లు బయటపడ్డాయి.

మొత్తంగా, కవర్ కార్గోతో కలిపి రూ. 4 కోట్లకు పైగా విలువైన 13,000 ఇ-సిగరెట్లను కస్టమ్స్ చట్టంలోని నంబంధిత సెక్షన్ల కింద స్వాధీనం చేసుకున్నారు.

ప్రజారోగ్య ప్రయోజనాల దృష్ట్యా మరియు ప్రజలను హాని నుండి రక్షించడం కోసం రూపొందించబడిన ఎలక్ట్రానిక్ సిగరెట్ల నిషేధ (ఉత్పత్తి, తయారీ, దిగుమతి, ఎగుమతి, రవాణా, అమ్మకం, పంపిణీ, నిల్వ మరియు ప్రకటన) చట్టం, 2019 ప్రకారం, భారతదేశంలో ఎలక్ట్రానిక్ సిగరెట్లు మరియు అన్ని ఎలక్ట్రానిక్ నికోటిన్ డెలివరీ సిస్టమ్స్ నిషేధించబడ్డాయి.

ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ మరియు పశ్చిమ బెంగాల్‌లోని వివిధ ఓడరేవులు, విమానాశ్రయాలు మరియు ఐసీడీలలో డీఆర్ఐ రూ. 135 కోట్లకు పైగా విలువైన సుమారు 3,55,000 ఇ-సిగరెట్లను స్వాధీనం చేసుకుంది.

ఈ స్వాధీనాలు, నరిహద్దు స్మగ్లింగ్‌ను ఎదుర్కోవడానికి మరియు దేశ ఆర్థిక, ప్రజారోగ్య ప్రయోజనాలతను పరిరక్షించడానికి డీఆర్ఐ యొక్క నిరంతర నిబద్ధతను స్పష్టం చేస్తున్నాయి.

అక్రమంగా ధాన్యం తరలిస్తున్న రెండు లారీలు పట్టివేత

అనుమతి పత్రాలు లేకుండా రవాణా.. రూ.4,500 మార్కెట్ ఫీజు వసూలు

వరంగల్, నవంబర్ 10: అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ధాన్యం తరలిస్తున్న రెండు లారీలను కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టు సిబ్బంది మంగళవారం పట్టుకున్నారు. మార్కెట్ నిబంధనల ప్రకారం వాటి నుంచి రూ.4,500 ఫీజు వసూలు చేసి వదిలిపెట్టారు.

మార్కెట్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూరు నుంచి గూడూరు మండలం గోవిందాపురంలోని ఓ రైస్‌మిల్లుకు ధాన్యం తరలిస్తున్న రెండు లారీలను కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని గూడూరు రోడ్డులో సిబ్బంది తనిఖీ చేశారు.

ఒక్కో లారీలో రూ.2 లక్షలకు పైగా విలువైన ధాన్యం ఉన్నట్లు గుర్తించారు. రవాణాకు సంబంధించిన ఎగుమతి పత్రాలు లేకపోవడంతో లారీలను నిలిపివేశారు. ఈ క్రమంలో డ్రైవర్లు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దీంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించిన సిబ్బంది నిబంధనల ప్రకారం ఒక లారీకి రూ.2,500, మరో లారీకి రూ.2,000 చొప్పున మార్కెట్ ఫీజు వసూలు చేసి వాటిని విడిచిపెట్టారు.

పరామర్శకు వెళ్లిన ఎంపీకి పద్యాల విందు..

ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎంపీ కడియం కావ్య

వరంగల్, నవంబర్ 10:స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లికి చెందిన కాళోజీ అవార్డు గ్రహీత, ప్రముఖ రచయిత్రి నెల్లుట్ల రమాదేవి తల్లి శకుంతలాదేవిని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఎంపీ తన ఇంటికి రావడంతో శకుంతలాదేవి ఆత్మీయంగా పలకరించారు.

ఈ సందర్భంగా 95 ఏళ్ల వయసులోనూ తన జ్ఞాపకశక్తిని చాటుకుంటూ శకుంతలాదేవి ఎంపీ కడియం కావ్యకు పలు పద్యాలను స్వయంగా వినిపించారు. వయసు మీద పడినా పద్యాలను ఎంతో చక్కగా ఆలపించడంతో ఎంపీ అబ్బురపడ్డారు. ఆసక్తిగా పద్యాలను విన్న ఆమె శకుంతలాదేవిని అభినందించారు. పరామర్శతోపాటు సాహిత్యపరమైన ఈ ఆత్మీయ కలయిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బూర్ల శంకర్, నీల గట్టయ్య, కౌన్సిలర్లు హరినాథ్, గుర్రం హైమ రమేష్, మున్సిపాలిటీ టౌన్ అధ్యక్షుడు అంబటి కిషన్‌రాజు, ఉపాధ్యక్షుడు నీల రాములు, కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షులు కొంతం శ్రీను, చెన్నూరి వెంకటేశ్వర్లు, చిక్కుడు రమేష్, నాయకులు బూర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీ నిర్వహణకు గ్రామస్తుల ఏకగ్రీవ ఆమోదం

చుంచుపల్లిలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

ములుగు నవంబర్ 10(నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లా మంగపేట మండలం చుంచుపల్లి రెవెన్యూ పరిధిలో గోదావరి నదిలో 19.95 హెక్టార్ల విస్తీర్ణంలో ప్రతిపాదించిన చుంచుపల్లి-9 ఇసుక క్వారీ నిర్వహణకు గ్రామస్తులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

మంగళవారం చుంచుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అదనపు కలెక్టర్ చీమలపాటి మహేందర్‌జీ మాట్లాడుతూ.. ఇసుక క్వారీ నిర్వహణపై ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించాలని సూచించారు. అధికారులు నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తారని తెలిపారు. పర్యావరణ నిపుణురాలు సునందారెడ్డి ప్రాజెక్టు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భారతదేశపు 100వ చెస్ గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచిన అనుజ్ శ్రీవత్రికి ప్రధానమంత్రి అభినందనలు

న్యూఢిల్లీ, నవంబర్ 10:అనుజ్ శ్రీవత్రి ఈ ప్రతిష్టాత్మక బిరుదును సాధించిన నేపథ్యంలో, భారతదేశం వంద మంది చెస్ గ్రాండ్‌మాస్టర్ల మైలురాయిని చేరుకోవడంపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు ప్రశంసలు కురిపించారు.

ఈ ఘనతను అసాధారణమైనదిగా అభివర్ణిస్తూ, భారతదేశపు 100వ చెస్ గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచిన అనుజ్ శ్రీవత్రికి ప్రధానమంత్రి అభినందనలు తెలిపారు, దీనిని ఒక అద్భుతమైన ఘనతగా అభివర్ణించారు. భారతదేశం 100 మంది గ్రాండ్‌మాస్టర్లను చేరుకోవడం ఒక విశేషమైన మైలురాయి అని, ఇది దేశ క్రీడాకారుల అపారమైన ప్రతిభ, అంకితభావం, కృషిని, అలాగే యువతలో చెస్ పట్ల పెరుగుతున్న ప్రజాదరణను ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు.

దేశంలోని వివిధ ప్రాంతాల నుండి యువ చెస్ ప్రతిభావంతులు ఉద్భవించి ప్రపంచ వేదికపై తమదైన ముద్ర వేయడాన్ని చూసి ప్రధానమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఘనత మరింత మంది యువతను చెస్ క్రీడను చేపట్టడానికి మరియు రాణించడానికి ప్రేరేపిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

హామీల అమలులో రేవంత్ ప్రభుత్వం విఫలం!

గత ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు.. సీఎం తీరుపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శలు



వరంగల్, నవంబర్ 10:ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మూడేళ్లు గడుస్తున్నా మహిళలకు నెలకు రూ.2,500 సాయం, తులం బంగారం, నిరుద్యోగులకు ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ వంటి హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. గత ప్రభుత్వాన్ని విమర్శించడమే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంపై ప్రభుత్వాన్ని నిలదీశారు.

రైతులకు సాగునీటి కష్టాలు

మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్న పిల్లర్లకు మరమ్మతులు చేయలేదని, కరువు మండలాల ప్రకటనలో భూపాలపల్లి నియోజకవర్గానికి అన్యాయం జరిగిందని గండ్ర ఆరోపించారు. గణపురం చెరువును పూర్తిస్థాయిలో నింపాలని, సలివాగు ఆయకట్టుకు నీరందించాలని కోరారు. దేవాదుల ప్రాజెక్టును నిరంతరాయంగా నడిపించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యం

నిరుద్యోగులకు ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ హామీలను ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను కూడా చెల్లించడం లేదన్నారు.

ప్రతిపక్ష ఎమ్మెల్యేల సస్పెన్షన్లు, ముందస్తు అరెస్టులతో ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రానున్న ఎమ్మెల్సీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజలు తమ నిర్ణయాన్ని ఓటు ద్వారా తెలియజేస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గండ్ర హరీష్‌రెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కనీస వసతులు లేని వివేకానంద హై స్కూల్ పై చట్టరీత్య చర్యలు తీసుకోవాలి

ఆఇూ గారికి వినతి పత్రం ఇచ్చిన బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజశేఖర్ వర్మ



ములుగు నవంబర్ 10(నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లా మల్లంపల్లి మండలంలో ఉన్న వివేకానంద హై స్కూల్ లో విద్యాహక్కు చట్టాన్ని పాటించకుండా విద్యార్థుల విషయం లో ఇష్టారీతిన వ్యవహరిస్తోందని, విద్యార్థులకు నరివడా మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్(ఖాఈ) జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజశేఖర్ వర్మ ఆరోపించారు.అలాగే విద్యార్థులకు సరిపడ తరగతి గదులు లేవని, పాఠశాల ఆవరణ లో పరిశుభ్రత లేకుండా పిచ్చి మొక్కలు పెరిగి ఉండడం తో విష సర్పాలు,తేళ్ళు,విష క్రిమికీటకాలు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. వివేకానంద స్కూల్ ఏర్పడి కొన్ని సంవత్సరాలు కావస్తున్న ఇప్పటివరకు ఫైర్ సేఫ్టీ కూడా లేదు,దీనివలన విద్యార్థుల ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని తెలిపారు, విద్యార్థులకు విద్యను బోధించే ఉపాధ్యాయులకు(టెట్) క్వాలిఫై లేకుండానే విద్యను బోధిస్తున్నారు.విద్యార్థులకు కనీస వసతులు కల్పించలేని వివేకానంద హై స్కూల్ పై విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్(ఖాఈ) జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజశేఖర్ వర్మ కోరారు. ఓఐూ గారికి పలుమార్లు ఈ విషయాన్ని చెప్పిన కూడా పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని అన్నారు.విద్యా ఉన్నతాధికారుల అండతోనే ఇలాంటి స్కూల్ లు యథేచ్ఛగా,ఇష్టానుసారంగా నడుస్తున్నాయని అన్నారు.

ఇలాంటి స్కూల్ ల పై తగిన చర్యలు తీసుకొని విద్యార్థుల బంగారు భవిష్యత్ ను కాపాడాలని ఆఇూ గారికి వినతి పత్రం ఇచ్చారు.

అరుణాచల్ ప్రదేశ్‌లోని బొమ్డిలాలో శాక్యముని బుద్ధుని పవిత్ర అవశేషాలు విశ్వాసాన్ని, భక్తిని ప్రేరేపిస్తున్నాయి

న్యూ ఢిల్లీ, నవంబర్ 10:అరుణాచల్ ప్రదేశ్‌లోని బొమ్డిలాలో ఉన్న తుబ్‌చోగ్ గట్సెల్ లింగ్ (ఉఒఒ) మఠం (దిగువ గోంపా)లో శాక్యముని బుద్ధుని పవిత్ర అవశేషాల ప్రదర్శన, వేలాది మంది భక్తులకు బుద్ధ భగవానునికి తమ భక్తిని అర్పించడానికి ఒక శుభప్రదమైన అవకాశాన్ని కల్పించింది. ప్రదర్శన మొదటి రెండు రోజులలో మొత్తం 11,969 మంది భక్తులు మఠాన్ని సందర్శించి, పవిత్ర అవశేషాల సమక్షంలో ప్రార్థనలు చేసి, ఆశీర్వాదం పొందారు.

అధిక సంఖ్యలో భక్తులు రావడం, బౌద్ధులకు అపారమైన మతపరమైన ప్రాముఖ్యతను కలిగి ఉన్న ఈ పవిత్ర అవశేషాలతో ముడిపడి ఉన్న ప్రగాఢ విశ్వాసాన్ని మరియు ఆధ్యాత్మిక భక్తిని ప్రతిబింబిస్తుంది.

ఈ ప్రదర్శనను భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీలోని జాతీయ మ్యూజియం, అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వం మరియు అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య , న్యూఢిల్లీ సహకారంతో నిర్వహిస్తోంది. వివిధ నియోజకవర్గాలు మరియు ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ప్రార్థనలు చేయడానికి మరియు తమ గౌరవాన్ని తెలియజేయడానికి అవకాశం కల్పిస్తూ, ఒఉ ఒ మఠంలో పవిత్ర అవశేషాల బహిరంగ దర్శనం నవంబర్ 13, 2026 వరకు కొనసాగుతుంది.

భక్తులు క్రమబద్ధంగా పాల్గొనేందుకు వీలుగా, ప్రదర్శన యొక్క మిగిలిన రోజులకు సంబంధించిన నియోజకవర్గం మరియు కేటగిరీల వారీ షెడ్యూల్ ఈ క్రింది విధంగా ఇవ్వబడింది:

నవంబర్ 11, 2026: అరుణాచల్ ప్రదేశ్‌లోని 5-కలక్తాంగ్ అసెంబ్లీ నియోజకవర్గం (ంఅ) నుండి భక్తులు

నవంబర్ 12, 2026: అరుణాచల్ ప్రదేశ్‌లోని 6-బురగావ్?త్రిజినో అసెంబ్లీ నియోజకవర్గం (ంఅ) నుండి భక్తులు

నవంబర్ 13, 2026: ఇతర జిల్లాల భక్తులు, జిల్లాలో విధులు నిర్వహిస్తున్న సాయుధ దళాలు మరియు కేంద్ర సాయుధ పోలీసు దళాల సభ్యులు, మరియు తమకు కేటాయించిన రోజులలో హాజరు కాలేకపోయిన భక్తులు.నిర్ణీత రోజులలో దర్శన సమయాలు ఉదయం 8:30 నుండి సాయంత్రం 6:00 వరకు ఉంటాయి.

బొమ్డిలాలో బహిరంగ ప్రదర్శన ముగిసిన తరువాత, ప్రదర్శనలో తదుపరి గమ్యస్థానమైన నమ్సాయి జిల్లాకు వాటి తదుపరి ప్రయాణం కోసం, పవిత్ర అవశేషాలకు 2026 నవంబర్ 14న లాంఛనప్రాయంగా వీడ్కోలు పలుకుతారు. 2026 నవంబర్ 14 నుండి 20 వరకు ప్రజల దర్శనం కోసం పవిత్ర అవశేషాలను నమ్సాయిలోని గోల్డెన్ పగోడాలో ప్రతిష్ఠిస్తారు. ఆ తరువాత, 2026 నవంబర్ 21న పవిత్ర అవశేషాలు న్యూఢిల్లీలోని జాతీయ మ్యూజియంకు తిరిగి వస్తాయి

ప్రత్యేక ప్రచారం 6.0 కింద ఆయుష్ మంత్రిత్వ శాఖ గణనీయమైన పురోగతిని నివేదించింది

న్యూఢిల్లీ, నవంబర్ 10:ఆయుష్ మంత్రిత్వ శాఖ, ప్రత్యేక ప్రచారం 6.0 కింద గణనీయమైన పురోగతిని సాధించింది. ఇందులో భాగంగా సకాలంలో ఫిర్యాదుల పరిష్కారం, సమర్థవంతమైన రికార్డుల నిర్వహణ మరియు తమ కార్యాలయాలన్నింటిలో పరిశుభ్రతపై గట్టిగా దృష్టి సారించింది.

ఈ ప్రచారం సందర్భంగా, మంత్రిత్వ శాఖ 368 ప్రజా ఫిర్యాదులను మరియు 64 ప్రజా ఫిర్యాదుల అప్పీళ్లను పరిష్కరించింది. తద్వారా, బాధ్యతాయుతమైన, పారదర్శకమైన మరియు పౌర-కేంద్రీకృత పాలన పట్ల తన నిబద్ధతను పునరుద్ఘాటించింది. అదనంగా, పార్లమెంట్ సభ్యుల నుండి వచ్చిన 7 సిఫార్సులను మరియు ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) నుండి వచ్చిన 4 సిఫార్సులను పరిష్కరించడం జరిగింది. ఇది సకాలంలో మరియు సమర్థవంతంగా ఫిర్యాదుల పరిష్కారంపై మంత్రిత్వ శాఖ యొక్క ప్రాధాన్యతను ప్రతిబింబిస్తుంది.

ఈ ప్రచారంలో భాగంగా, కార్యాలయాల పరిశుభ్రతను మెరుగుపరచడం, పరిశుభ్రమైన పని వాతావరణాన్ని ప్రోత్సహించడం మరియు కార్యాలయ స్థలాన్ని సద్వినియోగం చేసుకోవడం లక్ష్యంగా మంత్రిత్వ శాఖ 285 పరిశుభ్రతా కార్యక్రమాలను నిర్వహించింది.


రికార్డుల నిర్వహణ విభాగంలో, 1,610 ఫైళ్లను సమీక్షించి, అనవసరమైన వాటిని తొలగించి, మూసివేశారు. స్క్రాప్ మరియు వాడుకలో లేని రికార్డులను తొలగించడం ద్వారా, మొత్తం 8,741 చదరపు అడుగుల స్థలం ఖాళీ అయ్యి, దానిని మరింత ఉత్పాదక వినియోగానికి అందుబాటులోకి తెచ్చారు. స్క్రాప్ తొలగింపు ద్వారా మంత్రిత్వ శాఖ ?1,94,161 ఆదాయాన్ని కూడా ఆర్జించింది. ఇది మెరుగైన వనరుల నిర్వహణ మరియు పరిపాలనా సామర్థ్యాన్ని పెంచే దిశగా దాని ప్రయత్నాలను ప్రతిబింబిస్తుంది.

ఆయుష్ మంత్రిత్వ శాఖ, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులు మరియు అప్పీళ్లను సకాలంలో పరిష్కరించడం, క్రమబద్ధమైన రికార్డుల నిర్వహణ, పరిశుభ్రత మరియు ప్రభుత్వ వనరులను సమర్థవంతంగా ఉపయోగించడంపై దృష్టి సారిస్తూ ప్రత్యేక ప్రచారం 6.0ను అమలు చేయడం కొనసాగిస్తోంది. ఈ కార్యక్రమాల ద్వారా, పరిశుభ్రమైన, మరింత వ్యవస్థీకృతమైన మరియు పౌర-కేంద్రీకృత పని వాతావరణాన్ని నిర్మించాలని మంత్రిత్వ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.



దేశ తొలి విద్యా మంత్రి అబుల్ కలాం

నవంబర్ 11... అబుల్ కలాం ఆజాద్ జయంతి



దేశంలో విద్య అభివృద్ధికి తొలి బాట వేసిన విద్యాధికుడు అబుల్ కలాం ఆజాదే. ఆయన భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా పని చేశాడు. నవంబర్ 11న ఆయన జన్మదినం సందర్భంగా మన దేశంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపు కుంటారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ (నవంబర్ 11, 1888 ? ఫిబ్రవరి 22, 1958) స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖా మంత్రి, మౌలానా అబుల్ కలాం ఆజాద్. ఆయన అసలుపేరు 'మొహియుద్దీన్ అహ్మద్', 'అబుల్ కలాం' అనేది బిరుదు, 'ఆజాద్' కలంపేరు. ఆలియా బేగమ్, ఖైరుద్దీన్ అహమ్మద్ లకు 1888 నవంబరు 11 న మక్కాలో జన్మించాడు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ మక్కా నగరంలో 1888 నవంబర్ 11 న జన్మించారు. ఆయన వంశస్తులు బాబర్ రోజుల్లో హేరాత్ (ఆఫ్ఘనిస్తాన్ లో ఒక నగరం) కు చెందిన వారు. ఆజాద్ ముస్లిం పండితులు/ మౌలానాల వంశం నుండి వచ్చాడు. ఆయన తల్లి అరబ్, షేక్ మహ్మద్ జహీర్ వత్రి, తండ్రి మౌలానా ఖైరుద్దీన్ ఆఫ్ఘన్ మూలాలు గల ఒక బెంగాలీ ముస్లిం. ఖైరుద్దీన్ సిపాయి తిరుగుబాటు సమయంలో భారతదేశం నుండి మక్కా వెళ్ళి అక్కడే స్థిరపడ్డాడు.

1890 లో అయన తన కుటుంబంతో కలకత్తా వచ్చాడు. ఆజాద్ సంప్రదాయ ఇస్లామిక్ విద్య అభ్యసించాడు. ఆయన విద్య ఇంట్లో సాగింది. మొదట తండ్రి పిదప ఉపాధ్యాయులు ఇంట్లోనే బోధించాడు. ఆజాద్ మొదట అరబిక్, పెర్షియన్ తరువాత తత్వశాస్త్రం, రేఖాగణితం, గణితం, బీజగణితం నేర్చుకున్నాడు. స్వీయ అధ్యయనం ద్వారా ఇంగ్లీష్, ప్రపంచ చరిత్ర, రాజకీయాలు నేర్చుకున్నాడు. ఆజాద్ మౌలానా అగుటకు కావలసిన మత శిక్షణ పొందాడు. ఆయన దివ్య ఖురాన్ పై భాష్యం రాశాడు. విదేశాల నుంచి తిరిగి వచ్చాక ఆజాద్, బెంగాల్ కు చెందిన అరవింద ఘోష్, శ్యాం సుందర్ చక్రవర్తి వంటి ప్రముఖ విప్లవకారులను కలుసు కున్నాడు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు ఉద్యమాన్ని చేపట్టాడు. విప్లవాత్మక చర్యలు బెంగాల్, బీహార్ లకు పరిమితం అయిన విషయం ఆజాద్ కు తెలిసి రెండు సంవత్స రాలలో, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉత్తర భారతదేశం, బాంబే లాంటి ప్రాంతాలలో రహస్య విప్లవ కేంద్రాలు ఏర్పాటుచేసాడు. ఆ సమయంలో విప్లవ వాదులు ముస్లింల విప్లవ వ్యతిరేకులుగా భావించ సాగారు. ఎందుకంటే బ్రిటిష్ ప్రభుత్వం భారత దేశం యొక్క స్వాతంత్ర్య పోరాటానికి వ్యతిరేకంగా ముస్లిం కమ్యూనిటీని ఉపయోగిస్తున్నారని భావించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ తన సహచరులను ముస్లింల పట్ల వారి పగను పోగొట్టటానికి ప్రయత్నించాడు.

1912 లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూలో ' అల్ హిలాల్' వార పత్రిక ముస్లింల మధ్య విప్లవాత్మక భావాలను పెంచడానికి ప్రారంభించాడు. ఆజాద్ భారతీయ జాతీయ వాదం, హిందూ -ముస్లిం ఐక్యత ఆధారంగా విప్లవాత్మక ఆలోచనలతో మరో పత్రికను ''అల్ బలఘ్'' ప్రారంభించాడు. మౌలానా ఆజాద్, గాంధీజీ ఉప్పు సత్యా గ్రహంలో పాల్గొని 1930 లో అరెస్టు అయినాడు. ఆయనను ఒక సంవత్సరంన్నర పాటు మీరట్ జైల్లో ఉంచారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 1940 (రాంగడ్) లో కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికై, 1946 వరకు ఆ పదవిలో ఉన్నాడు. ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యా గ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని 10 సంవత్సరాలపాటు జైలుశిక్ష అనుభవించాడు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారత స్వాతంత్ర్య సమర ముఖ్య నాయకులలో ఒకడు. ఆయన ప్రఖ్యాత పండితుడు, కవి. 1947 ఆగస్టు 15 నుండి అంటే స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి 1958 ఫిబ్రవరి 2 వరకు కేంద్ర విద్యా శాఖ మంత్రిగా సేవలు అందించాడు.

ఈయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న అవార్డు ఇచ్చింది. అంతేకాదు ఆయన పేరిట పలు విద్యానంస్థలు కూడా నెలకొల్పబడ్డాయి. అబుల్ కలాం మంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీలోని ప్రసిద్ధ జామియా మిలియా ఇస్లామియా విశ్వ విద్యాలయం సహా భారతదేశం అంతటా వివిధ కళాశాలలు మరియు విశ్వ విద్యాలయాలు స్థాపించ బడ్డాయి. ఆయన సేవలకు గుర్తుగా 2008లో భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవంగా నిర్ణయించింది.

స్వాతంత్ర్య సమర యోధుడిగా, భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రిగా పనిచేసిన అబుల్ కలాం ఆజాద్ అసలు పేరు 'మొహియుద్దీన్ అహ్మద్', 'అబుల్ కలామ్' అనేది బిరుదు.. 'ఆజాద్' అనేది ఆయన కలం పేరు. ఆయన అరబిక్, ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ, పర్షియన్, బెంగాలీ తదితర భాషలలో మంచి ప్రావీణ్యత సంపాదించాడు. స్వయంగా సాహితీవేత్త అయిన ఆయన 'ఇండియా విన్స్ ఫ్రీడమ్'ను రాశాడు.

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మన దేశంలో విద్యావ్యవస్థ పటిష్టతకు, విద్యా వ్యవస్థను మెరుగు పరిచేందుకు అంకిత భావంతో పనిచేశాడు. చిన్నపిల్లల్లో ప్రాథమిక విద్యను ప్రోత్సహించడానికి పిల్లలను పాఠశాలల్లో చేర్పించడాన్ని ప్రోత్సహించారు. పాఠశాలలు, కళాశాలల నిర్మా?ణానికి జాతీయ కార్యక్రమాన్ని ప్రణాళికను రూపొందించాడు. 14 సంవత్సరాల వయస్సు వరకు పిల్లలకు ఉచిత మరియు నిర్బంధ విద్యను అందించే ఆలోచనను ఆయనే ముందుకు తెచ్చాడు. అలాగే "ప్రతి ఒక్కరూ ప్రాథమిక విద్యను పొందడం వ్యక్తి జన్మహక్కుగా పరిగణించాలి. లేదంటే పౌరులుగా తమ విధులను పూర్తిగా నిర్వర్తించలేరు" అని అబుల్ కలామ్ ప్రాథమిక విద్య గురించి వివరించాడు. అంతే కాదు, ఆడపిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంలో అనేక పథకాలను తీసుకొచ్చాడు.

ఆయన మార్గదర్శకత్వం మరియు నాయకత్వంలో విశ్వవిద్యాలయ గ్రాంట్ కమిషన్ (యుజిసి)ని విద్యా మంత్రిత్వ శాఖ 1953లో స్థాపించింది. అలాగే 1951లో అబుల్ నాయకత్వంలో మొదటి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్థాపించ బడింది. ఆయన ఒక దూరదృష్టిగల వ్యక్తి, భవిష్యత్ సాంకేతిక నిపుణులను రూపొందించడంలో ఐఐటిల సామర్థ్యాన్ని నమ్ముతాడు. "ఈ ఇన్స్టిట్యూట్ స్థాపన దేశంలో ఉన్నత సాంకేతిక విద్య మరియు పరిశోధనల పురోగతిలో ఒక మైలురాయిగా మారుతుంది అనడంలో నాకు ఎటువంటి సందేహం లేదు" అని మౌలానా ఆజాద్ పేర్కొన్నాడు.

గాంధీజీ ఆయనను భారత ప్లాటో అని, గాంధీ , నెహ్రూ ఆయనను మౌలానా, మార్-ఎ-కారవాన్ అని పిలిచేవాడు. 1992లో భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న ఇచ్చి గౌరవించింది.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

'ప్రభుత్వాలు తక్షణమే కరువు నివారణ చర్యలు చేపట్టాలి'

పంట రుణాలను రీ షెడ్యూల్ చేసి వడ్డీ మాఫీ చేయాలి
వరి పంటకు రూ.30 వేలు, పత్తి ఎకరానికి రూ.50 వేలు నష్ట పరిహారం చెల్లించాలి
సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్



నల్గొండ, నవంబర్ 10:ఎల్నినో కరువు పరిస్థితులను జాతీయ విపత్తుగా పరిగణించి తక్షణమే కరువు నివారణ చర్యలు చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. ప్రజలు, రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చండూరు తాసీల్దార్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంతో రైతులు వేసిన పంటలు ఎండిపోయాయని, గ్రామాలలో సాగునీరు, త్రాగునీరు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతులపై ఉన్న పంట రుణాలను తక్షణమే రీ షెడ్యూల్ చేయాలని, రుణాలపై వడ్డీని పూర్తిస్థాయిలో మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరువు నివారణ చర్యలు చేపట్టడంతో పాటు నష్టపోయిన రైతులకు ఎకరం రూ.50 వేల చొప్పున పత్తి పంటకు, రూ.30 వేల చొప్పున వరి పంటకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

డిండి ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలి

నల్లగొండ జిల్లాలో అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం కింద పని దినాలను 200 రోజులకు పెంచాలని, కరువు కోరల్లో చిక్కుకున్న ప్రజలను ఆదుకోవాలని ప్రభుత్వాలను కోరారు. సాగునీరు లేక ఎడారి ప్రాంతంగా ఉన్న మునుగోడు నియోజకవర్గానికి తాగునీరు అందించే డిండి ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకూ సిపిఐ పోరాటాలు కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి నలపరాజు సతీష్ కుమార్, పార్టీ జిల్లా సమితి సభ్యులు తిప్పర్తి రాములు, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, మండల పార్టీ కార్యవర్గ సభ్యులు బరిగల వెంకటేష్, దోటి వెంకన్న, జెల్ల శ్రీను, బండమీది వెంకన్న, సి హెచ్ ఉషయ్య, గంటా రమేష్, ఇరిగి సంజీవ, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం నవీన్, కస్తాల సర్పంచ్ లేదన్న సత్యం, కురుపాటి పరమేష్, గంట నగేష్, పల్లె శంకరయ్య, శివర్ల లింగస్వామి, చీకటిమూడు యాదయ్య, జోగు రమేష్, జగన్, నరహరి, శ్రీశైలం పాల్గొన్నారు.

హైదరాబాద్‌లోని జీఎస్ఐ శిక్షణ సంస్థలో మూడు ప్రధాన మౌలిక వసతులను ప్రారంభించిన కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ, నవంబర్ 10:హైదరాబాద్‌లో బండ్లగూడ?నాగోల్‌లో ఉన్న జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శిక్షణ సంస్థ (జీఎస్ఐటీఐ)లో మూడు ప్రధాన మౌలిక వసతులను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జీ కిషన్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు శ్రీ ఈటల రాజేందర్ ఈ రోజు ప్రారంభించారు. వీటిలో అంతర్జాతీయ వసతి గృహం (నలంద, తక్షశిల), అధునాతన జియోఫిజికల్ డేటా ప్రాసెసింగ్ ల్యాబొరేటరీ, డిజిటల్ స్టూడియో ఉన్నాయి.

ప్రారంభోత్సవం అనంతరం జీఎస్ఐటీఐ శిక్షణ, పరిశోధన, సామర్థ్య నిర్మాణ కార్యకలాపాలను బలోపేతం చేసేందుకు ఏర్పాటు చేసిన నూతన మౌలిక సదుపాయాలను కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి, శ్రీ ఈటల రాజేందర్ పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన సౌకర్యాలను సమీక్షించారు.

సభను ఉద్దేశించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రసంగించారు. అభివృద్ధి చెందిన దేశంగా మారే దిశగా భారత్ సాగిస్తున్న ప్రయాణంలో ఖనిజ, మైనింగ్ రంగం పోషిస్తున్న కీలకపాత్రను వివరించారు. 176 ఏళ్ల జీఎస్ఐ వారసత్వం గురించి, దేశవ్యాప్తంగా భూగర్భ సర్వేలకు ఈ సంస్థ అందించిన గణనీయమైన సహకారం గురించి తెలియజేశారు. జాతీయ కీలక ఖనిజ మిషన్ కార్యక్రమానికి ఉన్న ప్రాముఖ్యాన్ని ఆయన వివరించారు. అలాగే భారత దేశ ఖనిజ భద్రతను బలోపేతం చేయడానికి, ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించడానికి కీలకమైన ఖనిజాలు, అరుదైన మూలకాల అన్వేషణను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా కీలకమైన ఖనిజ నిక్షేపాలు ఉండే అవకాశం ఉన్న ప్రాంతాల్లో అన్వేషణను మరింత వేగవంతం చేయాలని జీఎస్ఐను కోరారు. అలాగే అన్వేషణ కార్యకలాపాలను వేగవంతం చేయడానికి, ఖనిజ బ్లాకులను సకాలంలో సిద్ధం చేయడానికి, వేలం జరిగేలా చూడటానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. రాజస్థాన్‌లోని సివానా రింగ్ కాంప్లెక్స్ (ఎస్ఆర్‌సీ)తో పాటు దేశంలో వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న అన్వేషణ ప్రయత్నాల గురించి ప్రస్తావించారు. అరుదైన భార మూలకాలు, ఇతర కీలకమైన ఖనిజాల అన్వేషణను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

జీఎస్ఐ అన్వేషణ, పరిశోధన సామర్థ్యాలను విస్తరించడంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించడం, సంస్థాగత సంస్కరణలు చేపట్టడం, అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడానికి ఉన్న ప్రాధాన్యాన్ని కూడా శ్రీ కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలతో సహకారాన్ని బలోపేతం చేయాల్సిన, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా శిక్షణా వసతులను మెరుగుపరచాల్సిన అవసరం గురించి కూడా వివరించారు. దేశంలోని జియోసైంటిఫిక్ వనరులను విస్తృతంగా వినియోగంలోకి తీసుకువచ్చేలా జియోలాజికల్ సమాచారాన్ని, డేటాను బహిరంగ వేదికల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జీఎస్ఐకు సూచించారు. భారతదేశ ఇంధన అవసరాలను తెలియజేస్తూ.. ఇంధన భద్రతను అందించడంలో తగినంత బొగ్గు ఉత్పత్తిని కొనసాగించడానికి ఉన్న ప్రాధాన్యం గురించి కేంద్ర మంత్రి వివరించారు. దేశ విద్యుత్ అవసరాలను తీర్చడంలో బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో శాస్త్రీయ పరిశోధన, సాంకేతిక పురోగతికి ఉన్న ప్రాధాన్యాన్ని పార్లమెంటు సభ్యులు శ్రీ ఈటల రాజేందర్ వివరించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలు, సెమికండక్టర్ పరిశ్రమలు, పరిశోధనలే ప్రపంచాభివృద్ధిని ముందుకు నడిపిస్తున్నాయన్నారు. ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా దేశాన్ని బలోపేతం చేయడానికి ఖనిజ వనరులను సమర్థంగా అన్వేషించి, వినియోగించుకోవడంతో పాటు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించడం అవసరమని చెప్పారు. హైదరాబాద్ జీఎస్ఐటీఐ అందిస్తున్న సేవలను ప్రశంసించారు. శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు తమ పరిశోధనా కార్యకలాపాలను ముమ్మరం చేసి జాతీయ అభివృద్ధికి దోహదపడాలని ఆయన ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమంలో జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ శ్రీ దినేశ్ వీ గన్వీర్, గనుల మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి ఫరీదా ఎం నాయక్, గనుల మంత్రిత్వశాఖ, జీఎస్ఐ, జీఎస్ఐటీఐకు చెందిన ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


మూడు సరికొత్త సౌకర్యాల గురించి:

అంతర్జాతీయ వసతి గృహం (నలంద, తక్షశిల): జీఎస్ఐ అందించిన రూ. 4.27 కోట్ల నిధులతో దీనిని ఏర్పాటు చేశారు. దీనిలో భోజనశాల, రిక్రియేషన్ వసతులు, వ్యాయామశాల, మినీ-లైబ్రరీ, లాండ్రీ లాంటి ఆధునిక సదుపాయాలతో పాటు పూర్తి స్థాయిలో ఫర్నీచర్ ఏర్పాటు చేసిన 32 సూట్లు ఉన్నాయి. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) సూచనల ప్రకారం దీనిని అభివృద్ధి చేశారు. ఇది అంతర్జాతీయ శిక్షణార్థులకు సౌకర్యవంతమైన బసను కల్పించడంతో పాటు వృత్తిపరమైన సంబంధాలను, సాంస్కృతిక వినిమయాన్ని, అంతర్జాతీయ సహకారాలను పెంపొందించడానికి తోడ్పడుతుంది.

అధునాతన జియోఫిజికల్ డేటా ప్రాసెసింగ్ ల్యాబరేటరీ: జాతీయ ఖనిజ అన్వేషణ, అభివృద్ధి ట్రస్టు (ఎన్ఎంఈడీటీ), జీఎస్ఐ సమకూర్చిన రూ.4.55 కోట్ల నిధులతో ఈ ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. దీనిలో 25 అత్యాధునిక కంప్యూటర్లు, అధునిక సాఫ్ట్‌వేర్ ఉన్నాయి. వీటిని ఖనిజాన్వేషణలో సామర్థ్యాన్ని బలోపేతం చేసేలా అధునాతన జియోఫిజికల్ డేటా ప్రాసెసింగ్, మోడలింగ్, ఇన్వర్షన్, సమాచార విశ్లేషణకు ఉపయోగిస్తారు.

డిజిటల్ స్టూడియో: సామర్థ్య నిర్మాణ కమిషన్ (సీబీసీ), జీఎస్ఐ అందించిన రూ.30 లక్షల వ్యయంతో ఈ స్టూడియోను ఏర్పాటు చేశారు. మిషన్ కర్మయోగికి అనుగుణంగా ఐజీపోటీ కర్మయోగి పోర్టల్ కోసం వీడియో పాఠాలు, పాడ్‌క్యాస్టులు, వెబినార్లతో సహా నాణ్యమైన డిజిటల్ లెర్నింగ్ వనరులను రూపొందించడానికి ఈ స్టూడియో వీలు కల్పిస్తుంది.

కొత్తగా ప్రారంభించిన ఈ సౌకర్యాలు సంస్థాగత మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి, అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడానికి, అధునాతన భూ వైజ్ఞానిక శిక్షణ, అంతర్జాతీయ సహకారం, డిజిటల్ లెర్నింగ్ సామర్థ్యాలను సులభతరం చేయడానికి గణనీయంగా దోహదపడతాయని భావిస్తున్నారు.



పోలింగ్ కేంద్రాలను పెంచాలని అఖిలపక్షం తీర్మానం

ఖమ్మం, నవంబర్ 10:బూర్గంపహాడ్ తాసీల్దార్ కార్యాలయంలో తాసీల్దార్ కేఆర్కే ప్రసాద్ మంగళవారం అఖిలపక్ష పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల పెంపు విషయమై చర్చించారు. అయితే ఆయా రాజకీయ పార్టీల నాయకులు బూర్గంపహాడ్‌లో గతంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటికి తోడు మరో రెండు పోలింగ్ కేంద్రాలను పెంచాలని తీర్మానం చేస్తూ తాసీల్దార్‌కు తీర్మాన పత్రాన్ని అందజేశారు. దీనికి తాసీల్దార్ ఉన్నతాధికారులకు అఖిలపక్ష నాయకుల సంతకాలతో కూడిన తీర్మానం పంపించి పోలింగ్ కేంద్రాల పెంపు కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ తాసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ తదితర పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

భారతదేశంలో 100వ చెస్ గ్రాండ్‌మాస్టర్‌గా అనుజ్ శ్రీవత్రీ.. అభినందించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 10:శ్రీ అనుజ్ శ్రీవత్రీ ప్రతిష్టాత్మక చెస్ గ్రాండ్ మాస్టర్ టైటిల్‌ను సాధించడంతో భారత్ పక్షాన ఈ టైటిల్ గెలిచిన వందో గ్రాండ్‌మాస్టర్ అయ్యారు. ఈ నేపథ్యంలో శ్రీ అనుజ్ శ్రీవత్రిని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు అభినందించారు.

ఃఅసాధారణ విజయమంటూ ప్రధానమంత్రి ప్రశంసించారు. శ్రీ అనుజ్ శ్రీవత్రీ భారతదేశానికి 100వ చెస్ గ్రాండ్‌మాస్టర్‌గా నిలవడం ఒక అద్భుత ఘట్టమని ప్రధాని వర్ణిస్తూ, అతడికి అభినందనలు తెలిపారు. భారత్‌లో 100 మంది గ్రాండ్‌మాస్టర్లు ఉండడం ప్రశంసనీయ విజయ ప్రస్థానమనీ, ఇది అపార ప్రతిభ, అంకితభావంతో పాటు దేశంలో క్రీడాకారుల కఠిన పరిశ్రమకు అద్దం పడుతోందనీ, అంతేకాకుండా చదరంగంపట్ల యువతలో ఆదరణ అంతకంతకూ పెరుగుతోందని కూడా అర్థం అవుతోందని ప్రధానమంత్రి అన్నారు.

ఃదేశంలో వివిధ ప్రాంతాల్లో చదరంగానికి సంబంధించి యువ ప్రతిభావంతులు రావడం, అంతర్జాతీయ స్థాయిలో తమ ముద్ర వేయడం చూస్తే సంతోషంగా ఉందని ప్రధానమంత్రి అన్నారు. మరింత మంది యువజనులు చదరంగాన్ని ఎంచుకొని, ప్రావీణ్యాన్ని సంపాదించాలని ప్రయత్నించేందుకు ఈ కార్యసాధన స్ఫూర్తిని అందించగలుగుతుందన్న ఆశాభావాన్ని ప్రధాని వ్యక్తం చేశారు.

భారతదేశం పక్షాన 100వ చెస్ గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచిన అనుజ్ శ్రీవత్రీకి అభినందనలు. ఎంతటి అద్భుత విజయమిది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hydera bad-500020. Telang ana. 'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93 @gmail.com.